జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 03, ఫిబ్రవరి 2025 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం

## సారీ పాప.. జగన్ తిట్టమంటేనే

# నిన్ను తిట్టా!

- నిన్ను తిట్టాలని జగన్ నన్ను రెండురోజులు ఒత్తిడి చే శారు
- నేను ముందు ఒప్పుకోనందుకే సుబ్బారెడ్డితో తిట్టించారు
- నాకు తర్వాత తిట్టక తప్పలేదు
- తప్పయింది.. అవి మనసులో పెట్టుకోవద్దు
- వైసీపీ ఎంపీలను బీజేపీలో చేర్పించాలని ఢిల్లీ నేతలు ఆదేశించారు
- ఢిల్లీ ప్రతిపాదనకు జగన్ ఒప్పుకోలేదు
- అప్పుడు నాకూ,బాబుకు తేడా ఏముంటుంది అన్నారు
- పియూష్ గోయల్ నన్ను రాజీనామా చేయమని చెప్పారు
- అందుకే రాజీనామా చేశా
- జగన్ వద్దని నన్ను వారించారు
- ఇద్దరం కలిసే హిమాలయాలకు వెళదామన్నారు
- తారకరత్న భార్యతో కలసి షర్మిలతూ భేటీ అయిన వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి
- 'మహానాడు'కు ప్రత్యేకం



(మార్తి సుబ్రహ్మణ్యం)

"వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ నిన్ను తిట్టమంటేనే తిట్టాల్సివచ్చింది. జగన్ ఆస్తులతో నీకెలాంటి సంబంధం లేదు. అవి జగన్ కష్టార్జితమని మీడియాకు చెప్పాల్సివచ్చింది. అప్పటి పరిస్థితి అది. తప్పలేదు. అప్పటికీ నేను రెండురోజులు నీ గురించి మాట్లాకపోతేనే సుబ్బారెడ్డితో నిన్ను తిట్టించారు. మూడవరోజు నాకు తప్పలేదు. సారీ పాపా" ఇదీ.. ఏపీసీసీ చీఫ్, జగన్ చెల్లెలు షర్మిలారెడ్డితో.. ట్కవె సీపీ మాజీ ఎంపి వేణుంబాక విజయసాయిరెడ్డి భేటీ సారాంశం.

సినీనటుడు, దివంగత తారకరత్న భార్య అలేఖ్యారెడ్డితో కలసి..లోటస్‌పాండ్‌కు వెళ్లిన విజయసాయి, ఆమెతో సుదీర్ఘంగా మంత నాలు సాగించారు. షర్మిలను వైఎస్ కుటుంబ సభ్యులు, సన్నిహితులు పాప అని సంబోధిస్తుం టారని తెలిసిందే. ఆ సందర్భంగా వైసీపీలో ఉన్నప్పుడు షర్మిలను నానామాటలు అన్నం దుకు సాయిరెడ్డి ఆమెకు సారీ చెప్పారన్నది కాంగ్రెస్ వర్గాల కథనం.

అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం షర్మిల వద్దకు తారకరత్న సతీమణి అలేఖ్యా రెడ్డిని వెంటబెట్టుకుని వెళ్లిన విజయసాయిరెడ్డి.. గతంలో షర్మిల ఆస్తులపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తావించి, సారీ చెర్పారట. తన ఆస్తులతో నీకు సంబంధం లేదని జగన్ ప్రెస్‌మీట్ పెట్టి చెప్పమని రెండురోజులు తనను పిలిచి మరీ ఒత్తిడి చేశారని, ముందు తాను స్పందించకపో వడంతో, సుబ్బారెడ్డిని పిలిచి నిన్ను తిట్టమని చెప్పార ని షర్మిలకు సాయిరెడ్డి వివరించారట. ఆ తర్వాత తాను ఆస్తులపై స్పందించి, విమర్శించాల్సి వచ్చిందని వివరణ ఇచ్చారు. అయితే మీ కుటుంబవిధేయుడిగా మీ ఆస్తులపై మాట్లాడాల్సి రావడం నాకు బాధగానే ఉందని, ఆ విషయంలో మిమ్మల్ని మనస్థాపానికి గురిచేయడంపై

మిగతా.. 2లో



## ఢిల్లీ పీఠంపై బీజేపీ జెండా ఎగరాలి

- బీజేపీ అభ్యర్థుల గెలుపునకు తెలుగు ప్రజలు కృషి చేయాలి
- ఢిల్లీలో వాతావరణ కాలుష్యంతో పాటు రాజకీయ కాలుష్యం ఉంది.
- 1995లో హైదరాబాద్ ఉన్నట్లుగా ఇప్పుడు ఢిల్లీ ఉంది
- ప్యాలెస్‌లు కట్టుకునేవారిని కాదు... ప్రజల కోసం పనిచేసేవారికి ఓటేయండి
- ఏపీలో జగన్ రుషికొండ ప్యాలెస్‌లా ఢిల్లీలో కేజ్రీవాల్ శేషమహల్ నిర్మాణం
- ప్యాలెస్‌లోకి అడుగుపెట్టక ముందే ఏపీలో చిత్తుగా ఓడించారు... ఇక్కడా అదే జరగాలి
- ఢిల్లీ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం
- ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- తెలుగువారు ఏకపక్షంగా బీజేపీకి ఓటేయాలని పిలుపు

ఢిల్లీ: 'పదేళ్లకుపైగా అధికారంలో ఉన్న ఆమ్‌ఆద్మీ పార్టీ ఢిల్లీ ప్రజలకు కనీసం స్వచ్ఛమైన తాగునీరు ఇవ్వలేకపోయింది. దేశం స్వచ్ఛ భారత్‌లో దూసుకుపోతుంటే ఢిల్లీ మాత్రం మురికి కూపంలోకి వెళ్లిపో తోంది. ఢిల్లీలో వాతావరణ కాలుష్యంతో పాటు పొలిటికల్ పొల్యూషన్ కూడా ఉంది. 1995లో హైదరాబాద్ ఉన్నట్లు ఇప్పుడు ఢిల్లీ కూడా ఉంది. అభివృద్ధి రాజకీయాలు, జీవన ప్రమాణాలు పెరగాలంటే కమలం గుర్తును గెలిపించుకోవాలి. ఊపిరిపీల్చు కోవాలంటే మోదీ ఆక్సీజన్ కావాలి' అని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఢిల్లీలో బీజేపీ అభ్యర్థుల తరపును తెలుగు ఓటర్లు ఉండే ప్రాంతంలో ప్రచారం చేశారు. తెలుగు ప్రజ లను ఉద్దేశించి సీఎం చంద్రబాబు ప్రసంగించారు.

### బీజేపీ గెలుపులో తెలుగువారు భాగమవ్వాలి

'ఢిల్లీలో ఇంతమంది తెలుగువారు ఉంటారని అనుకోలేదు. ఢిల్లీలో స్థిరపడ్డ ప్రతి తెలుగు ఓటరు బీజేపీకి ఓటు వేసి గెలిపించాలి. తెలుగువారు ఢిల్లీలోనే కాదు... ప్రపంచ వ్యాప్తంగా ఉన్నారు ఇది భారతీయులు, తెలుగువారి సత్తా. పెట్టు బడుల కోసం ఇటీవల దావోస్ వెళ్లినప్పుడు



650 మంది అక్కడ ఉన్నారు. ఏఐ, గ్రీన్ ఎనర్జీని ప్రధాని మోదీ ప్రమోట్ చేస్తు న్నారు. 1995లో ఐటీ గురించి మాట్లా డాను... ఇప్పుడు ఏఐ గురించి మాట్లాడు తున్నాను. ఢిల్లీలోని ప్రజలు, ప్రత్యేకంగా తెలుగు తమ్ముళ్లు, చెల్లెల్లు ఇంటింటికెళ్లి బీజేపీ గెలుపు.. దేశ చరిత్రకే ఒక మలుపు అని చెప్పాలి.

ఐటీలో భారతీయులను ఢీ కొట్టే వారు ఎవరూ లేరు. నా తమ్ముళ్లు ప్రపంచంతా దూసుకుపోతున్నారు. దేశానికి యువత పెద్ద ఆస్తి. సరైన సమయంలో మన దేశానికి సరైన నాయకుడిగా మోదీ ఉన్నారు. మన దేశ బ్రాండ్ మార్మోగడానికి కారణం ప్రధాని మోదీ. 11 ఏళ్లుగా సంక్షేమం, అభివృద్ధి, సంస్కరణల్లో దేశాన్ని శరవేగంతో ముందుకు

మిగతా.. 2లో

## భువనేశ్వరి, బాలయ్య మధ్య

# నలిగిపోతున్నా..

- చంద్రబాబు చమత్కారం
- తన ఫాంహౌస్ లో ఫ్యామిలీ పార్టీ ఏర్పాటు చేసిన నారా భువనేశ్వరి
- హాజరైన చంద్రబాబు
- ఆద్యంతం ఉల్లాసంగా కార్యక్రమం



నందమూరి బాలకృష్ణకు కేంద్ర ప్రభుత్వం ఇటీవలే పద్మభూషణ్ ప్రకటించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో, తన అన్నయ్య బాలకృష్ణ గౌరవార్థం సొంత ఫాంహౌస్‌లో నారా భువనేశ్వరి గ్రాండ్‌గా పార్టీ ఏర్పాటు చేశారు. ఈ కుటుంబ వేడుకకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇంకా, ఏపీ బీజేపీ చీఫ్ దగ్గుబాటి పురందేశ్వరి, నారా, నందమూరి కుటుంబ సభ్యులు హాజరైన ఈ ఫ్యామిలీ పార్టీ ఆద్యంతం ఉల్లాసంగా సాగింది. ముఖ్యంగా, చంద్రబాబు తన చమత్కా రాలతో అందరినీ నవ్వించారు. నారా భువనేశ్వరి కూడా చంద్రబాబుతో కొన్ని సరదా వ్యాఖ్యలు చేయడం ఈ కార్యక్రమంలో

మిగతా.. 2లో

## ఇకపై రెడ్డి, వెలమలకు

# మాకు విడాకులే

- రాష్ట్రానికి చివరి ఓసీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే
- బీసీలు తెలంగాణ ఓనర్లు
- ఎవని సొమ్ము మీద ఎవడు కూసున్నడు?
- బీసీలకు బీ ఫామ్ లు ఇవ్వనప్పుడు రెడ్ల తోటి సోపతి ఎందుకు ఇంకా?
- రెడ్లు, వెలమలు అసలు తెలంగాణ వారే కాదు
- టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీల్లో రెడ్లకే బి ఫామ్ లు
- బీఆర్ఎస్ పార్టీనే కొనేసే ఆర్థిక స్తోమత బీసీలకు ఉంది
- ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలి
- లేకుంటే ప్రభుత్వాన్నే రద్దు చేయాల్సిన పరిస్థితి కల్పిస్తాం
- వరంగల్ బీసీ రాజకీయ యుద్ధభేరి సభలో తీన్మార్ మల్లన్న



వరంగల్: ఏడాదికి లక్ష ఇరవై వేల కోట్ల రూపా యలు బీసీలు రాష్ట్ర ఎకా నమీకి ఇస్తున్నాం. కానీ మనకు బడ్జెట్‌లో 9వేల కోట్లు కేటాయించారు. పిడికెడు మందిలేని వారు 60మంది ఎమ్మెల్యేలుగా ఉన్నారు. ఇక అలా ఉండొద్దు. నిన్నటిదాకా ఒక లెక్క ఇప్పటి నుంచి ఒకలెక్క. రెడ్లు, వెలమలు అసలు తెలంగాణ వారే కాదు. ఇతర రాష్ట్రాల నుంచి తరలి వచ్చారు. ఇకపై రెడ్డి, వెలమలకు మాకు

మిగతా.. 2లో

- 119 మంది ఎమ్మెల్యేలో 43 మంది రెడ్లు
- 60శాతం మంది ఉన్న బీసీలకు 19 మంది ఎమ్మెల్యేలు
- సామాజికన్యాయం చేయని వాడు పరిపాలన చేయడానికి అర్హుడు కాదు
- రేపు మల్లన్న ముఖ్యమంత్రి కావొచ్చు.
- వరంగల్ బీసీ రాజకీయ యుద్ధభేరి సభలో మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు సంచలన వ్యాఖ్యలు



# మొత్తం రెడ్లకే టికెట్లు..

## రెడ్లే ఎమ్మెల్యేలు.. వాళ్ల అబ్బ జాగీరా?

వరంగల్: మనం బిచ్చగాళ్లల అడుక్కుంటున్నం. 75 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఇంకా రేషన్ కార్డు కోసం అడుక్కునే పరిస్థితులు ఎందుకు ఉన్నాయి? రేషన్ కార్డు ఇస్తా,గొర్రె ఇస్తా,బర్రె ఇస్తా ఇంకోటి ఇస్తా అంటే చేయి చాపుతున్నాం. బాబా సాహెబ్ ఓటు హక్కు ఇచ్చిండు..ఆ ఓటు తోనే కదా వాళ్ళు పాలిస్తున్నారు. యువతా.. మీరు సైలెంట్ గా ఉంటున్నారు కాబట్టే వాళ్ళు శాసిస్తున్నారు..

వాళ్ళు ఎంత మంది ఉన్నారు? మీరు ఉచ్చ పోస్తే కొట్టుకు పోతారు. నల్గొండ లో ఆలేరు ఎమ్మెల్యే ఐలయ్య ఒక్కడే బీసీ..ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్లు లేకుంటే అవ్వి కూడా వాళ్ళే పోటీ చేస్తారు. మొత్తం రెడ్లకే టికెట్లు ఇచ్చారు.. రెడ్లే ఎమ్మెల్యేలు.. వాళ్ల అబ్బ జాగీరా? మొత్తం 119 మంది ఎమ్మెల్యేలో 43 మంది రెడ్లు ఉన్నరు... అంటే సగం జనాభాలో 60శాతం మంది ఉన్న బీసీలకు 19 మంది ఎమ్మెల్యేలు ఉన్నరు. భవిష్యత్ లో ఓట్లు మనయే...సీట్లు మనయే

కేసిఆర్ ముఖ్యమంత్రి అయ్యిండు..రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యిండు. రేపు మల్లన్న ముఖ్యమంత్రి కావొచ్చు. నాకు తీన్మార్ మల్లన్న ఉదయించే సూర్యుడిలెక్క కనిపిస్తున్నడు. రాజ్యాధికారం కోసం మల్లన్న అడుగు వేసిండు.. ఇట్లనే కొట్లాడుతా అంటే 70ఏళ్ల నేను 16 ఏళ్ల పిలగాని వలె ఆయన వెంట నడుస్తా. ఇక్కడికి వచ్చిన వారంతా..7న జరిగే వెయ్యి గొంతులు,లక్ష డప్పుల సభకు రావాలే.

మిగతా.. 2లో



# బీసీలు: 1,64,09,179

- ఎస్సీ లు: 61,84,319 (17.43%)
- ఎస్టీ లు : 37,05,929 (10.45%)
- మొత్తం ముస్లింలు: 44,57,012
- ఇతర ఓసీ లు: 44,21,115
- మొత్తం ఓసీ జనాభా 53 లక్ష లు
- ఈ నెల 4న కులగణన నివేదిక క్యాబినెట్ ముందుకు
- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి


హైదరాబాద్: తెలంగాణ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ సుల్తానియా రాష్ట్రంలో కులగణన అంశంపై రూపొందించిన నివేదికను మంత్రివర్గ ఉపసంఘానికి అందజేశారు. ప్లానింగ్ డిపార్ట్ మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ సుల్తానియా రాష్ట్రంలో కులగణన అంశంపై రూపొందించిన నివేదికను మంత్రివర్గ ఉపసంఘానికి అందజేశారు. మంత్రివర్గ ఉపసంఘం సమావేశమై నివేదికపై చర్చించిన అనంతరం మంత్రి ఉత్తమ్

మిగతా.. 2లో




05

కేశినేని చిన్నికి 'సమాచార'సేవ!



06

బీసీ జనగణన ఎంత సక్కగ చేసిండ్రో?!



03

రేవంత్ రెడ్డి.. ఇప్పటికైనా హైడ్రా దుకాణం బంద్ చేయండి


# ఆడాళ్లూ... మీకు జోహార్లు!

- మహిళా క్రికెట్‌లో మనమే విశ్వవిజేత
- దక్షిణాఫ్రికాను మట్టికరిపించిన భారత్
- మళ్లీ మెరుపులు మెరిపించిన మన తెలుగమ్మాయి త్రిష

ఆడాళ్లేకదా అనుకోవద్దు.. అదరకొట్టేస్తారు! తామేంటో చూపిస్తారు. అది అట్టాంటి ఇట్టాంటి విజయం కాదు. ఏకంగా ప్రపంచకప్ ఎగరేసుకుని వచ్చి.. ఇదీ మా కెపాసిటీ అని మీసం మెలేస్తారు. యస్. మన టీమిండియా మహిళా క్రికెట్ టీమ్ సరిగ్గా అదే చేసింది.

మహిళా క్రికెట్ ప్రపంచకప్‌లో టీమిండియా తొలినుంచీ సంచలనాలు సృష్టిస్తూనే ఉంది. మన టీమ్ ధాటికి ప్రత్యర్థి జట్లు పేకమేడల్లా కూలిపోయాయి. ముఖ్యంగా మన తెలుగమ్మాయి.. భ ద్రాచలం అమ్మాయి త్రిష, వరల్డ్‌కప్‌లా మామూలుగా ఆడలేదు. ఒకరేంజ్‌లో చెలరేగింది. ప్రత్యర్థుల బౌలింగ్‌ను చీల్చి చెండాడి ఫోర్లు, సిక్సర్లతో నిప్పులు కురిపించింది. చివరాఖరకు దక్షిణాఫ్రికాతో

మిగతా.. 2లో



జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
2
డిజిటల్ న్యూస్ పేపర్ ‖ సోమవారం 03, ఫిబ్రవరి 2025 ‖

## సారీ పాప.. జగన్ తిట్టమంటేనే నిన్ను తిట్టా!

**మొదటి పేజీ తరువాయి..**

విచారం వ్యక్తం చేస్తున్నట్లు షర్మిలకు వివరణ ఇచ్చుకున్నారట.

ఈ సందర్భంగా రాజకీయాలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. బీజేపీలోఒక అగ్రనేత.. పార్టీ ఎంపీలను బీజేపీలో చేర్పించమని తన ద్వారా జగన్‌కు సందేశం పంపించారట. ఆ ప్రతిపాదనకు జగన్ ఒప్పుకోలేదు. అలా చేస్తే నాకూ చంద్రబాబుకూ తేడా ఏముంటుందని జగన్ ప్రశ్నించారని షర్మిలకు సాయిరెడ్డి చెప్పారు. ఆ తర్వాత తనను వెళ్లి పియూష్‌గోయల్‌ను కలవమన్నారని, ఆయన తనను రాజీనామా చేయమని చెప్పిన తర్వాతనే వైసీపీకి రాజీనామా చేశానని షర్మిలకు, సాయిరెడ్డి వివరించారట. తాను పార్టీకి రాజీనామా చేస్తున్న విషయం జగన్‌కు చెప్పినప్పుడు ఆయన ఒప్పుకోలేదని, ఇద్దరం కలిసే హిమాలయాలకు వెళదామని వ్యాఖ్యానించారట.

కాగా జగన్ ఒత్తిడి చేసినందుకే తనపై విమర్శలు చేశానని చెప్పిన విజయసాయిరెడ్డిని.. "ఆ విషయాన్ని మీరు ఇప్పుడు మీడియాకు చెప్పవచ్చు కదా? మీరు ఏ పార్టీలో లేనందున అలా చెప్పడం వల్ల వచ్చిన నష్టమేమీ లేదు కదా? పైగా ఆ ఆస్తులన్నీ జగన్‌వే అనుకుంటున్న వారికి మీ సమాధానం వల్ల స్పష్టత వస్తుంది కదా" అని షర్మిల కోరినప్పుడు.. సాయిరెడ్డి మౌనం వహించినట్లు సమాచారం.

## బీసీలు: 1,64,09,179

**మొదటి పేజీ తరువాయి..**

కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. వెనుకబడిన తరగతులకు న్యాయం చేయాలనేదే తమ ఆకాంక్ష అని.. రాహుల్‌గాంధీ ఆకాంక్ష మేరకు రాష్ట్రంలో సామాజక, కులగణన సర్వే చేపట్టామని తెలిపారు. మన దేశంలో స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి జనగణన జరుగుతున్నదని, అయితే అసలైన పేదలను గుర్తించేందుకు వీలుపడే కులగణన మాత్రం ఇంతవరకు జరగలేదని చెప్పారు.

రాష్ట్రవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కులగణన చేయాలని అసెంబ్లీ తీర్మానించిందని తెలిపారు. బలహీనవర్గాల అభ్యున్నతికి అవసరమైన వివరాల సేకరణ కోసం కులగణన చేపట్టామని అన్నారు. సామాజిక కులగణన సర్వేలో 1,03,889 మంది ఎన్యుమరేటర్‌లు పాల్గొన్నారని చెప్పారు.

రాష్ట్రంలోని 96.9 శాతం మంది అంటే 3.54 కోట్ల మంది సర్వేలో పాల్గొని తమ వివరాలను అందించారని, 3.1 శాతం మంది.. అంటే 16 లక్షల మంది వివిధ కారణాల వల్ల తమ వివరాలను అందించలేదని అన్నారు. రాష్ట్ర మొత్తం జనాభా 3.70 కోట్లని చెప్పారు. ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఉపాధి తదితర అంశాలపై సమగ్ర అధ్యయనం జరిగిందని, సర్వేను అడ్డుకోవాలని కొందరు ప్రయత్నించినా అధికారులు విజయవంతంగా పూర్తిచేశారని తెలిపారు.

ఈ నెల 4న కులగణన నివేదికను రాష్ట్ర క్యాబినెట్ ముందు పెడుతామని, క్యాబినెట్‌లో చర్చించిన అనంతరం అసెంబ్లీలో ప్రవేపెడతామని మంత్రి ఉత్తమ్ చెప్పారు. సమాజంలో విప్లవాత్మక మార్పు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ముందుకు వెళ్తోందని అన్నారు. మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, దామోదర రాజనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ కులాల వారీగా సర్వే వివరాలు

**సామాజిక ఆర్థిక రాజకీయ కుల గణన ప్రకారం:**

బీసీ లు: 1,64,09,179 (46.25%)
-బీసీ ముస్లింలు: 35,76,588 (10.08%)

**మొత్తం బీసీలు ..**

46.25%+10.08%= (56.34%)
1 కోటి 99 లక్షల 85 వేల 767 వందలు
ఎస్సీలు: 61,84,319 (17.43%)
ఎస్టీలు : 37,05,929 (10.45%)
మొత్తం ముస్లింలు: 44,57,012 (12.56%)
-బీసీ ముస్లింలు: 35,76,588 (10.08%)
- ఓసీ ముస్లింలు: 8,80,424 (2.48%)
- ఇతర ఓసీలు: 44,21,115 (13.31%)
మొత్తం ఓసీ జనాభా: 53 లక్షల 01530
13.31% + 2.48% = (15.79%)

## భువనేశ్వరి, బాలయ్య మధ్య నలిగిపోతున్నా..

**మొదటి పేజీ తరువాయి..**

నవ్వులు పూయించింది.

నారా భువనేశ్వరి తన భర్త చంద్రబాబుకు వేదికపై మైక్ అందిస్తూ... ఏమండీ ఒకసారి ఇలా రండి... బాలా గురించి కొన్ని మాటలు మాట్లాడండి... అయితే ఐదు నిమిషాల్లో స్పీచ్ అయిపోవాలి... ఇదేమీ రాజకీయ ప్రసంగం కాదు... గంటలు గంటలు మాట్లాడొద్దు అని అన్నారు. తన అర్ధాంగి మాటలకు నవ్వుతూనే మైక్ అందుకున్న చంద్రబాబు... అన్నాచెల్లెళ్లను ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

"ఇది నిజంగా అద్భుతమైన సాయంత్రం. ఒకవైపున బాలయ్య... మరోవైపు అంతే పవర్ ఫుల్ అయిన భువ (భువనేశ్వరి)... ఇద్దరి మధ్యన నేను నలిగిపోతున్నా... వీళ్లిద్దరి మధ్యన ఉంటే చాలా ప్రమాదం! ఈ ఫ్యామిలీ పార్టీ గురించి కూడా నాకేమీ తెలియదు.... 'నేనేం చేస్తానో మీకు ఎవరికీ చెప్పను... నా అన్నయ్యకి నేను చేయబోయే కార్యక్రమం నా అభిమానంతో చేస్తున్నాను... ఇందులో మీకెవరికీ ప్రమేయం లేదు... ఇది నా అభిమతం' అని చెప్పి భువనేశ్వరి ఈ కార్యక్రమం ఏర్పాటు చేసింది" అని చంద్రబాబు వివరించారు. ఇక, తన బావమరిది బాలకృష్ణను చంద్రబాబు ఈ సందర్భంగా పొగడ్తల్లో ముంచెత్తారు. "నిన్నటి దాకా అల్లరి బాలయ్య... ఇప్పుడు పద్మభూషణుడు... ఎన్టీఆర్‌ను గుర్తుపెట్టుకునేలా బాలయ్య నడుచు కుంటున్నారు... అందుకు నేను గర్విస్తున్నాను. బాలయ్య అన్ స్టాపబుల్ కెరీర్‌లో ఇదొక మైలురాయి. ఆయనకు పద్మభూషణ్ రావడం మా కుటుంబానికి గర్వకారణం. మా కుటుంబంలో ఇంతపెద్ద అవార్డు రావడం ఇదే ప్రథమం. మా కుటుంబం అంతా ఎంతో ఆనందిస్తోంది. కెరీర్ పరంగా చూస్తే బాలయ్య నాకంటే సీనియర్. ఆయన 1974లో తొలి సినిమా చేస్తే, నేను 1978లో తొలిసారి ఎమ్మెల్యే అయ్యాను. బాలకృష్ణ పైకి అల్లరిగా కనిపించినా, లోపల డెప్త్ ఉంది, ఒక డెడికేషన్ ఉంది. గొప్ప మానవతా దృక్పథం ఉన్న వ్యక్తి. క్యాన్సర్ ఆసుపత్రిని అద్భుతంగా తీర్చిదిద్దారు. బాలయ్య టేకోవర్ చేసిన తర్వాత క్యాన్సర్ ఆసుపత్రి దేశంలోనే అగ్రగామి ఆసుపత్రుల్లో ఒకటిగా పేరుతెచ్చుకుంది. అందుకు నేనెంతో గర్విస్తున్నాను. ముచ్చటగా మూడు సార్లు హిందూపురంలో ఎమ్మెల్యేగా గెలిచిన బాలయ్య... అప్పుడప్పుడు ఆయన అర్ధాంగి వసుంధరకు టికెట్ ఇవ్వమని అడుగుతుంటాడు. మరి కావాలనే ఆ విధంగా అడుగుతాడో, లేక ఆమెను మెప్పించడానికి అడుగుతాడో అర్థం కాదు" అంటూ చంద్రబాబు నవ్వులు పూయించారు.

## టీమిండియా జట్టు రేవంత్ రెడ్డి అభినందన



**హైదరాబాద్:** వరుసగా రెండోసారి అండర్-19 మహిళల ప్రపంచ కప్‌ను గెలుచుకున్న టీమిండియా జట్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. ఫైనల్ మ్యాచ్‌లో అద్భుతమైన ఆటతో టీమిండియా అమ్మాయిల జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ బిడ్డ గొంగడి త్రిష ని ప్రత్యేకంగా ప్రశంసించారు.

మలేషియా వేదికగా జరిగిన అండర్-19 మహిళల ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ లో సౌతాఫ్రికాపై విజయం సాధించి ఇండియా విశ్వ విజేతగా నిలిచింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలానికి చెందిన త్రిష ఆల్ రౌండ్ ప్రతిభ కనబరిచారు. దూకుడుగా ఆడి చివరి వరకు నిలబడి సత్తా చాటారు. టోర్నీలో అత్యధిక పరుగులు సాధించి ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచారు. గొంగడి త్రిష లాంటి క్రీడాకారులు తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని ముఖ్య మంత్రి అభిప్రాయపడ్డారు. మరింతగా రాణించి భవిష్యత్తులో టీమిండియా సీనియర్ జట్టులో చోటు దక్కించుకోవాలని ఆకాంక్షించారు. అద్భుతమైన క్రీడా నైపుణ్యమున్న యువతీ యువకులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని భరోసా ఇచ్చారు.

### ఇకపై రెడ్డి, వెలమలకు
## మాకు విడాకులే

**మొదటి పేజీ తరువాయి..**

విడాకులే. దానికి ఈసభే వేదిక.

బీసీలకు మీఓట్లు వద్దు. బీసీల ఓట్లు మాకు వద్దని చెప్పే దమ్ము మీకుందా ?బీసీలకు బీఫామ్ లకు జరుగుతున్న యుద్ధం ఇది. తెలంగాణ రాష్ట్రం మీతాత జాగీరు కాదు... మీకు కౌలుకిచ్చినం. మీ కౌలు అయిపోయింది...2028లో వచ్చేది బీసీల రాజ్యమే. తెలంగాణ రాష్ట్రానికి చివరి ఓసీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే. తెలంగాణలో ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలి, లేకుంటే ప్రభుత్వాన్నే రద్దు చేయాల్సిన పరిస్థితి కల్పిస్తాం. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి. బీఆర్ఎస్ పార్టీనే కొనేసే ఆర్థిక స్థోమత బీసీలకు ఉంది. తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ సార్. నాలుగేళ్ల తర్వాత బీసీ బిడ్డ తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవుతాడు..రాసిపెట్టుకోండి. బీసీలు ఈ రాష్ట్ర ఖజానాకు ఏడాదికి 1లక్ష20వేల కోట్లు జమచేస్తున్నం. ఎవని సొమ్ము మీద ఎవడు కూసున్నడు?

మనం ఓనర్లం..మన సంపద ఖర్చు పెట్టే హక్కు మనకే ఉండాలే. టీచర్ల, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీల్లో రెడ్లకే బి ఫామ్ లు ఇస్తున్నారు. బీసీలకు బీ ఫామ్ లు ఇవ్వనప్పుడు రెడ్ల తోటి సోపతి ఎందుకు ఇంకా? ఇది బీ ఫామ్ లకు బీసీలకు జరుగుతున్న యుద్ధం. తల్లి పాలు తాగిన ప్రతి బీసీ బిడ్డ ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీసీలకే ఓటు వేయాలే.

## మొత్తం రెడ్లకే టికెట్లు..

**మొదటి పేజీ తరువాయి..**

"రాజ్యాధికారం సంపాదించలేకపోతే మనమేం చేయలేం. మనలో చైతన్యం రాకపోతే ఇట్లనే ఉంటం. మన ఓట్లు మనకు చాలు. మనమే సీఎంను నిర్ణయిద్దాం. నా నలభై ఏళ్ల రాజకీయ జీవితం పోరాటాలతోనే సరిపోయింది. నాకు ఇప్పుడు 70 ఏళ్లు. ఇక యువకులే ముందుకురావాలి. దానికంటే మన యువకులకు ఆవేశం ఉండాలి. ఆలోచన రావాలి. పౌరుషం ఉండాలే. అంబేద్కర్ ఇచ్చిన అవకాశం వాడుకోవాలే. ఎవడబ్బసొమ్ము? మా నల్లగొండ జిల్లాలో ఒక్కో ఇంటికి ఇద్దరు ఎమ్మెల్యేలా? ఒకే కులానికి పోయాయి. వీళ్లు ఏమైనా ఉద్ధరిస్తున్నారా? నీ అబ్బజాగీరా? మొత్తానికి 12కు 12కు పోటీ చేస్తారా? సామాజికన్యాయం చేయని వాడు పరిపాలన చేయడానికి అర్హుడు కాదు. మల్లన్న ధైర్యంగా ముందుకువెళ్లారు.

ఈ పెత్తనానికి తెరదించాలంటే మన ఓట్లు మనమే వేసుకోవాలే. సీఎంను మనమే డిసైడ్ చేసుకోవాలే" అన్నారు. ఆర్ కృష్ణయ్య బీజేపీపై ఒత్తిడి చేసి ఓబీసీ శాఖ పెట్టించాలి. మార్పు రావలసిందే. ఓట్లు మనమే సీట్లు మనమే"నని స్పష్టం చేశారు. కులగణన చేసినందుకు, ఎస్సీ వర్గీకరణకు తీర్మానం చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు చెప్పారు.

## ఆడాళ్లూ... మీకు జోహార్లు!

**మొదటి పేజీ తరువాయి..**

జరిగిన ఫైనల్‌లోనూ, త్రిష బ్యాట్ నిప్పులు కురిపించి ఇండియా విజయాన్ని శాసించింది. ఫలితంగా.. ప్రపంచకప్ భారత్ వశమయింది. జయహో భారత్!

మహిళల అండర్-19 టీ20 ప్రపంచకప్‌ను భారత్ కైవసం





చేసుకున్నది. ఫైనల్‌లో దక్షిణాఫ్రికా నిర్దేశించిన 83 పరుగుల టార్గెట్‌ను ఒక వికెట్ కోల్పోయి కేవలం 11.2 ఓవర్లలోనే ఛేదించి విశ్వ విజేతగా నిలిచింది.

మరోసారి తెలంగాణలోని భద్రాచలానికి చెందిన గొంగిడి త్రిష రాణించింది. తొలుత బౌలింగ్‌లో మూడు వికెట్లు పడగొట్టి సత్తా చాటిన ఆమె.. బ్యాటింగ్‌లోనూ అదరగొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. ఫైనల్‌లో మరో బ్యాటర్ సానిక చల్కే కూడా రాణించారు.

కాగా, తుదిపోరులో టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా సరిగ్గా 20 ఓవర్లలో కేవలం 82 పరుగులకే కుప్పకూలింది. ఆ జట్టులో వాన్ వూరస్ట్ (23) టాప్ స్కోరర్‌గా నిలిచారు. మిగిలిన బ్యాటర్లంతా చేతులెత్తేశారు. భారత బౌలర్లలో గొంగడి త్రిష 3, వైష్ణవి శర్మ 2, ఆయుషి శుక్లా 2, పరుణిక 2, షబ్నమ్ ఒక వికెట్ తీశారు. 83 పరుగులు టార్గెట్‌తో బరిలోకి దిగిన టీమిండియా సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించి విశ్వవిజేతగా నిలిచింది .

ఈ మ్యాచ్‌లో త్రిష 44 పరుగుల చేయగా, సానిక 26 పరుగలు చేసింది. మరో బ్యాటర్ కమలిని ఎనిమిది పరుగులే చేసి ఔటయ్యింది. ఇదిలా ఉండగా.. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్ మరోసారి కప్ సాధించడం పట్ల ఫ్యాన్స్ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఢిల్లీ పీఠంపై బీజేపీ జెండా ఎగరాలి

**మొదటి పేజీ తరువాయి..**

తీసుకెళ్తున్నారు. వికసిత్ భారత్‌లో భాగంగా 2047 కల్లా దేశం నెంబర్ వన్ అవుతుంది. భారతీ యులు శక్తివంతమైన జాతిగా మారతారు. కానీ ఢిల్లీకొస్తే చాలా బాధ కలుగుతోంది. డబుల్ ఇంజిన్ సర్కారు వచ్చి ఉండుంటే వాషింగ్టన్, న్యూయార్క్‌ను ఢిల్లీ తలదన్నేది. ఉద్యోగాల కోసం ఇక్కడి నుంచి చాలామంది హైదరాబాద్, బెంగళూరు వెళ్లాలని చూస్తున్నారు. దీనికి కారణం ఇక్కడి పాలకులు.

### మురికి కూపంగా ఢిల్లీ

'ఢిల్లీ అభివృద్ధి కావాలంటే బీజేపీ అధికారంలోకి రావాలి. ఈ దేశానికి రాజ ధాని అయిన ఢిల్లీ సమస్యల వలయంలో చిక్కుకుపోయి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. పదేళ్లు ఏం చేశారని అడిగితే స్కూళు పెట్టామన్నారు. చదివిన వారికి ఉద్యోగాలు వచ్చాయా..? ఉద్యోగాలకు బెంగళూరు, హైదరాబాద్ వెళ్లడానికి కారణం ఇక్కడి పాలకులు. దేశం స్వచ్ఛ భారత్ వైపు దూసుకెళ్తుంటే.. ఢిల్లీ మాత్రం మురికి కూపంగా మారుతోంది. సరైన నీటి పైపులైన్లు లేక తాగునీరు కలుషిత మౌతోంది. ఒకప్పుడు బీహార్ నుంచి ఇక్కడికి ఉపాధికి వచ్చేవారు... కానీ ఇప్పుడు దక్షిణ భారతదేశం వెళ్తున్నారు. అభివృద్ధి జరిగిన చోటకు వలసలు ఉంటాయి.

### బీజేపీ గెలిస్తేనే సంక్షేమ ఫలాలు

'ఈ ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తుంది. హెూలీ, దీపావళి పండుగకు ఉచితంగా గ్యాస్



సిలిండర్ ఇవ్వడంతో పాటు రూ.500కు సిలిండర్ అందిస్తుంది. ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా పేదల వైద్యం కోసం రూ.5 లక్షలు, వృధ్యాప్య పెన్షన్లు రూ.2,500, వితంతువు, దివ్యాంగులకు రూ.3 వేలు ఇస్తుంది. కేజీ టు పీజీ వరకు ఉచిత విద్య అందిస్తుంది. గరీబ్ కళ్యాణ అన్న కింద 5 కేజీల బియ్యం ఉచితంగా ఇస్తుంది.

### ప్యాలెస్‌లు కట్టుకునే వారు పాలకులుగా వద్దు

'ఢిల్లీ వాసులకు తాగునీరు అందించడంలో ఆప్ ప్రభుత్వం విఫలమైంది. ప్రధాని అమృత్ కింద ఇంటింటికీ స్వచ్ఛమైన నీరు ఇచ్చేందుకు మోదీ సంకల్పించారు. కేంద్రం ఇచ్చే సబ్సీడీని కూడా అసమర్ధ ప్రభుత్వం వినియోగించుకోలేదు. అధికారంలో బీజేపీ ఉండుంటే మోదీ నాయకత్వంలో స్వచ్ఛ భారత్‌లో భాగంగా ఢిల్లీ స్వచ్ఛంగా ఉంటుంది. యమునా నదిని శుద్ధి చేస్తానని కేజ్రీవాల్ ప్రగల్భాలు పలికారు.పదేళ్లలో చేయలేని వారు ఇప్పుడు చేస్తారా.? మోదీ నాయకత్వంలో గంగానది ప్రక్షాళన జరుగుతోంది.. యమునా శుద్ధి జరగాలంటే మోదీకే సాధ్యం. ఆప్ పాలనలో అభివృద్ధి లేదు, రోడ్లు లేవు, మౌలిక సదుపాయలు లేవు.



గాలి కాలుష్యం అయితే తట్టుకోలేనంతగా ఉంది. దేశవ్యాప్తంగా గెలిచి వచ్చి ఇక్కడ ఎంపీలుండే ప్రాంతంలో భయంకర పరిస్థితులు ఉన్నాయి. అధికారం కోసం కాదు... ప్రజాసేవ కోసం రాజకీయాలు చేయాలి. ఆయారాం, గయారాంలు కాదు.. సుస్థిర పాలన ఉండాలి. ప్యాలెస్‌లు కట్టుకునేవారిని కాదు... ప్రజలకు చిత్తశుద్ధితో సేవ చేసేవాళ్లను ఎంచుకోండి. షహదారా ఎమ్మెల్యేగా సంజయ్ గోయల్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నా.

### ప్రత్యర్థిపార్టీకి డిపాజిట్లు రాలేదు

'ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీ కలిపి పోటీచేస్తే ప్రత్యర్థి పార్టీ గల్లంతైంది. డిపాజిట్లు కూడా తెచ్చుకోలేకపోయింది.. 7 నెలల్లోనే రాష్ట్రానికి రూ.7 లక్షల కోట్లు పెట్టుబడులు తీసుకొచ్చాం. డబుల్ ఇంజన్ సర్కారు రావాలంటే బీజేపీ గెలిపించాలి. బీజేపీ గెలిస్తే మోదీ ఢిల్లీని అభివృద్ధిలో పరిగెత్తిస్తారు. ప్రపంచ నేతలు వచ్చినప్పుడు ఢిల్లీని చూసి ఇలా ఉందేంటి అంటే మనకు బాధకలుగుతోంది. ఉచిత రేషన్ నుంచి ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాల వరకు, జల్ జీవన్ మిషన్ నుంచి డిజిటల్ ఇండియా వరకు దేశ భవిష్యత్ కోసం మోదీ చేపట్టారు.

డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, జల్ జీవన్ మిషన్ వంటి కార్యక్రమాలు చేపట్టారు. నూతన బడ్జెట్‌లో రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ దేశాన్ని భ్రష్టు పట్టించి నాశనం చేసింది. కేజ్రీవాల్ ఢిల్లీని భ్రష్టు పట్టించారు. పంజాబ్ ఒకప్పుడు దేశాన్ని రక్షించడానికి ముందుండటంతో పాటు ఆహారాన్ని అందించేంది. అలాంటి రాష్ట్రం ఆర్థికంగా బలహీనపడింది. నాయకుడికి కావాల్సింది ప్రజలకు ఏం కావాలో ఇస్తూనే భవిష్యత్ ప్రణాళిక రూపొందించేట్లు ఉండాలి.

### ప్యాలెస్‌లోకి ప్రవేశించకముందే చిత్తుగా ఓడించండి

'ఏపీలో రుషికొండ ప్యాలెస్ కట్టారు. ఆ ప్యాలెస్‌లోకి ప్రవేశించేలోపే జగన్ ఇంటికి వెళ్లాడు. ఢిల్లీలో కూడా కేజ్రీవాల్ బ్రహ్మాండమైన శేషమహల్ కట్టారు. ఆ శేషమహల్‌లోకి ప్రవేశించడానికి ముందే మీరుచిత్తుగా ఓడించాలి. ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీదే గెలుపు. ఒకప్పుడు దేశ విభజనను సర్దార్ వల్లాభాయ్ పటేల్ అడ్డుకుని ఏకం చేశారు. అటువంటి గట్టి నాయకుడు మోదీ టీం ఇండియా నినాదంతో ప్రపంచంలో నెంబర్ వన్‌గా చేయాలని పని చేస్తున్నారు. తెలుగువారు ఎక్కడున్నా ఒక్కటిగా ఉండాలి. మీకు అండగా, తోడుగా నేనుంటా.' అని సీఎం చంద్రబాబు అన్నారు.







జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

03

డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 03, ఫిబ్రవరి 2025

## 40 లక్షల కోళ్లు మృతి!

- ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో రోజుకు వేల సంఖ్యలో కోళ్లు మృత్యువాత



ఏలూరు: అంతు చిక్కని వైరస్ కోళ్ల పెంపకందార్లను కలవరపెడుతోంది.. కలకలం రేపుతోంది! ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో రోజుకు వేల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. గతేడాది డిసెంబర్‌లో మొదలైన ఈ వైరస్.. జనవరి 13 తర్వాత విజృంభించింది. H15N వైరస్ లక్షణాలతో ఇప్పటికే 40 లక్షల కోళ్ల చనిపోయి ఉంటాయని అంచనా అధికారులు వేస్తున్నారు. అంతు చిక్కని వైరస్‌తో కోళ్లు చనిపోతున్నాయని, తాము తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు.

## ఢిల్లీలో కులకడానికి మీకు ఓట్లు వేశారా కిషన్ రెడ్డి?

- కిషన్ రెడ్డి,బండి సంజయ్ దద్దమ్మలు,చేతగానివాళ్ళు
- ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఢిల్లీలో గాడిదలు కాస్తున్నారా?
- తెలంగాణకు రూపాయి ఇవ్వనందుకు బల్లలు చరిచారా?
- తెలంగాణ ప్రజలకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీ ఎంపీలు క్షమాపణ చెప్పాలి
- బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్ రెడ్డి



హైదరాబాద్: నిన్న కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ తెలంగాణ పట్ల బీజేపీకి చిత్తశుద్ధి లేదని అర్ధం అయింది. పోయిన సంవత్సరం గుండు సున్నా కేంద్ర బడ్జెట్‌లో ఇచ్చారు. కేసీఆర్ పది ఏళ్ళు అనేక కార్యక్రమాలు చేపట్టి నిధులు అడిగినా కేంద్రం ఇవ్వలేదు. తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు విఫలం చెందారు.

తెలంగాణ నుండి ఉన్న ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి ఏం సాధించారు? తెలంగాణకు రూపాయి ఇవ్వకుండా డ్రీమ్ బడ్జెట్ అని కిషన్ రెడ్డి అంటున్నారు. బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ,రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, సైనిక్ స్కూల్నవోదయ స్కూల్,వరంగల్ ఎయిర్ పోర్ట్ ప్రస్తావన లేదు. ఢిల్లీలో కులకడానికి మీకు ఓట్లు వేశారా కిషన్ రెడ్డి ఢిల్లీ,బీహార్ రాష్ట్రాల బడ్జెట్ గా కేంద్ర బడ్జెట్ ఉంది.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాల ప్రస్తావన ఉండకపోతే బీహార్ ప్రస్తావన ఎందుకు వచ్చింది? పోలవరం ప్రాజెక్టు ఎత్తు 41.5 మీటర్లు ఎత్తు పెంచి నిధులు తెచ్చుకున్నారు. పక్క రాష్ట్రంలో ఉన్న కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు,పెమ్మసాని చంద్రశేఖర్ లను చూసి కిషన్ రెడ్డి,బండి సంజయ్ బుద్ధి తెచ్చుకోవాలి. తెలంగాణ ప్రజలకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీ ఎంపీలు క్షమాపణ చెప్పాలి. తెలంగాణ ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఢిల్లీలో గాడిదలు కాస్తున్నారా?

వెనుకబడిన ప్రాంతాలకు నిధులు ఇవ్వలేదు. బడ్జెట్ ప్రసంగం జరిగేటప్పుడు కిషన్ రెడ్డి,బండి సంజయ్, ఎంపీలు బల్లలు చరిచారు. తెలంగాణకు రూపాయి ఇవ్వనందుకు బల్లలు చరిచారా? విద్యా,వైద్య రంగం, సంక్షేమ రంగాల్లో కేటాయింపులు తగ్గించారు. ధర్మపురి అరవింద్ పసుపు బోర్డుకు బాండ్ పేపర్ రాసి ఇచ్చారు. కేంద్ర బడ్జెట్ లో పసుపు బోర్డుకు రూపాయి నిధులు కేటాయించలేదు. కేసీఆర్ హయాంలో హైదరాబాద్ నగరం అభివృద్ధి చెందింది.

సికింద్రాబాద్ నుండి ఎంపీగా కిషన్ రెడ్డి ఉండి నయా పైసా తీసుకురాలేదు. తెలంగాణలో జెండా పాతుతామని కిషన్ రెడ్డి అంటున్నారు. నయా పైసా తీసుకురానందుకు ప్రజలు మీకు ఓట్లు వేయలా? తెలంగాణ,దక్షిణాదిరాష్ట్రాలు అంటే ఎందుకు చిన్నచూపు? నిన్న నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగం 70 నిమిషాల్లో ముగిసింది. 4 లక్షల రూపాయలకు మాత్రమే పన్ను మినహాయింపు ఇచ్చారు.

రేవంత్ రెడ్డి మోదీని బడే భాయ్ అన్నారు. బడ్జెట్ లో బడా షేర్ఇస్తారని అన్నారు.

కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి,బండి సంజయ్ దద్దమ్మలు, చేతగానివాళ్ళు. ఇప్పటికైనా కేంద్రం కళ్ళు తెరవాలి. పోలవరం ప్రాజెక్టు ఎత్తు పెంచడం ద్వారా భద్రాచలం మునుగుతుంది. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి కళ్ళు తెరవాలి. గోదావరి,బనకచర్ల ద్వారా గోదావరి నీళ్లను ఏపీ తరలించుకుపోతుంది.

## రేవంత్ రెడ్డి.. ఇప్పటికైనా హైడ్రా దుకాణం బంద్ చేయండి

- కాంగ్రెస్ పాలనలో రైతులు, చేనేత కార్మికులు, ఆటో డ్రైవర్లు, బిల్డర్ల ఆత్మహత్యలు
- కాంగ్రెస్ పార్టీ అసమర్ధ పాలనతో ఆత్మహత్య చేసుకున్న బిల్డర్ వేణుగోపాల్ రెడ్డి (కొంపల్లి) నివాసం వెళ్లి, కుటుంబ సభ్యులను పరమర్శించిన మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే వివేకానంద గౌడ్, బీఆర్ఎస్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, తదితరులు
- వేణుగోపాల్ రెడ్డి ఆత్మహత్య కు గల కారణాలు అడిగి తెలుసుకున్న మాజీ మంత్రి హరీష్ రావు.
- ఏడాది నుండి రియల్ఎస్టేట్ లో నష్టాలు వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేసేవారని కన్నిటి పర్యంతమైన కుటుంబ సభ్యులు
- బి ఆర్ ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచిన హరీష్ రావు



హైదరాబాద్: ఆత్మహత్య చేసుకున్న వేణుగోపాల్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించాము. ఆ కుటుంబ ఆవేదన చూస్తే కళ్ళల్లో నీళ్లు తిరుగుతున్నాయి. వేణుగోపాల్ రెడ్డి ఆత్మహత్య ఒకరకంగా చెప్పాలంటే కాంగ్రెస్ ప్రభుత్వ హత్య. ఒకప్పుడు బిల్డర్ అంటే క్యూ కట్టి అప్పులు ఇచ్చిన బ్యాంకులు, 14 నెలల కాంగ్రెస్ పాలన పుణ్యమా అని అప్పు పుట్టని పరిస్థితి. ఒక్క అపార్ట్మెంట్ కూడా అమ్ముడుపోక, బ్యాంకుల్లో అప్పులు రాక దిక్కు తోచని స్థితిలో ఆత్మ స్థైర్యం కోల్పోయి ఆత్మహత్య చేసుకున్నడు.

ఒక యువ బిల్డర్ ఇలా 39 ఏళ్ల వయసులో చనిపోవడం బాధాకరం. 5 ఏళ్ల చిన్న పసిపాప కూడా ఉంది. ఆ కుటుంబ రోదనకు కారణం ఎవరు. మిగతా బిల్డర్లు ఇలాంటి ఆత్మహత్యలు చేసుకోకుండా చూడాలని రేవంత్ రెడ్డిని ఆ కుటుంబ సభ్యులు కోరుతున్నారు. గొప్ప మానవత్వం వారిది. కాంగ్రెస్ పాలనలో రైతులు, చేనేత కార్మికులు, ఆటో డ్రైవర్లు.. ఇప్పుడు బిల్డర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

బిఆర్ఎస్ పాలనలో నిర్మాణ రంగానికి స్వర్గధామంగా ఉన్న హైదరాబాద్ లో ఫ్లాట్లు అమ్ముడు పోలేదని బిల్డర్ ఉరేసుకునే పరిస్థితి రావడం శోచనీయం. ఈ ఆత్మహత్య లన్నిటికీ ప్రత్యక్షంగా, పరోక్షంగా కాంగ్రెస్ నిర్లక్ష్య పాలన, అనాలోచిత అసమర్థ విధానాలే కారణం. నేను రియల్ ఎస్టేట్ రంగం నుంచి వచ్చాను, రియల్ ఎస్టేట్ గురించి నాకు చెప్తారా?' అని మీడియా సమావేశంలో దబాయించిన సీఎం రేవంత్‌రెడ్డి అనాలోచిత నిర్ణయాలతో, రియల్ ఎస్టేట్ రంగాన్ని చేజేతులా నాశనం చేస్తున్నడు.

ఇప్పటికైనా హైడ్రా దుకాణం బంద్ చేయండి రేవంత్ రెడ్డి . ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్న పరిస్థితి. ప్లాట్లు అమ్మలేక, మిత్తీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. విదేశాల్లో ఉండే వారు, ఉత్తర భారత ప్రజలు హైదరాబాదులో అపార్ట్మెంట్లు కొనేందుకు వెనుకాడుతున్న పరిస్థితి. హైడ్రా భయం వల్ల హైదరాబాద్ లో పెట్టుబడులు పెట్టలేని దుస్థితి. వాళ్లు బతుకుతూ 10 మందిని బతికించే బిల్డర్ల ప్రాణం మీదకు తెచ్చింది ఈ కాంగ్రెస్ సర్కారు.

హైడ్రా అని చెప్పి పర్మిషన్లు ఉన్న బిల్డింగులు కూల కొట్టావు. కోర్టు మొట్టికాయలు వేసింది. నెగిటివ్ ఎన్విరాన్మెంట్ సృష్టించావు. పాజిటివిటీ లేకుండా పోయింది. మెట్రో రద్దు అన్నడు, ఫార్మా సిటీ రద్దు అన్నడు, పది గంటల తర్వాత దుకాన్లు బంద్ అన్నాడు..ఇలా అనాలోచిత నిర్ణయాలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్లాట్లు అమ్ముకోలేని పరిస్థితి. పదేళ్లలో కేసీఆర్ హైదరాబాదును రోలు మోడలుగా తేర్చిదిద్దారు. ఏడాదిలో రేవంత్ రెడ్డి హైదరాబాద్ ఖ్యాతిని దిగజార్చాడు.

బిల్డర్స్ అసోసియేషన్లు తోటి బిల్డర్ ప్రాణాలు కోల్పోతే స్పందించాల్సిన అవసరం ఉంది. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి కష్టాన్ని పట్టించుకోండి.చిన్న బిల్డర్లు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు వారితో మాట్లాడండి. HMDA, GHMC లో ఎందుకు అనుమతులు ఆలస్యం అవుతున్నాయి. UC రావాలంటే ఎందుకు రావడం లేదు? మీరే మున్సిపల్ మంత్రిగా ఉన్నారు మీరే ముఖ్యమంత్రిగా ఉన్నారు ఇప్పటికైనా చొరవ చూపండి.

తోటి బిల్డర్ ఆత్మహత్య చేసుకొని ఐదు రోజులు గడిచింది ఒక్క బిల్డర్ అసోసియేషన్ కూడా వచ్చి కుటుంబాన్ని పరామర్శించలేదు.

రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికి స్పందించలేదు. బిల్డర్ చనిపోతే చీమకుట్టినట్టు లేదు. బిల్డర్ చనిపోవడం మొదటిసారి. కాంగ్రెస్ ప్రభుత్వం సిగ్గుపడాలి. త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశంలో బిల్డర్ సమస్యల గురించి మాట్లాడదాం. ప్రభుత్వం కళ్లు తెరిపిస్తాం.

## చంద్రబాబు పాలనలో రాయలసీమకు ప్రతిసారీ అన్యాయం

- రాయచోటి నీటి కష్టాలపై కనీసం స్పందించని చంద్రబాబు
- మా ప్రాంతానికి ఒక్క విద్యాసంస్థను కూడా ప్రకటించలేదు
- రాయలసమీ సాగునీటి ప్రాజెక్ట్‌లపై చంద్రబాబు శీతకన్ను
- బనకచర్ల క్రాస్‌పై కనీస ప్రణాళిక కూడా లేదు
- రాయచోటి వైయస్ఆర్‌సీపీ కార్యాలయంలో మాజీ చీఫ్ విప్, పార్టీ సీనియర్ నేత గడికోట శ్రీకాంత్ రెడ్డి మీడియా సమావేశం

రాయచోటి: ముఖ్యమంత్రిగా చంద్రబాబు పాలనలో ప్రతిసారీ రాయలసీమకు అన్యాయమే జరుగుతోందని మాజీ చీఫ్ విప్, వైయస్ఆర్ సీపీ సీనియర్ నేత గడికోట శ్రీకాంత్ రెడ్డి మండిపడ్డారు. రాయచోటి వైయస్ఆర్ సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్ట్ ల నుంచి విద్యాసంస్థల ఏర్పాటు వరకు చంద్రబాబు ఏనాడు ఈ ప్రాంత అభివృద్దిపైన చిత్తశుద్దితో వ్యవహరించలేదని ధ్వజమెత్తారు. తాజాగా రాయచోటి పర్యటన సందర్భంగా సీఎం హోదాలో కొత్త విద్యాసంస్థలు, రాయచోటి నీటికష్టాలకు పరిష్కారంను ప్రకటిస్తారని ఆశించిన ప్రజలకు చంద్రబాబు తీవ్ర నిరాశను మిగిల్చారని అన్నారు.

వైయస్ జగన్ హయాంలో రాయచోటి ప్రజలకు నీటి కష్టాలు తప్పించేందుకు శ్రీశైలం రిజర్వాయర్ లో నీరు తగ్గిపోయినా కూడా ప్రత్యామ్నాయంగా గండికోటలో నిల్వ చేసిన నీటిని వాడుకునేందుకు ప్రణాళిక సిద్దం చేశాం. కాలేటివాగును ఒక టీఎంసీకి అభివద్ధి చేసి, అక్కడి నుంచి వెలిగల్లుకు నీటిని పంపించేందుకు వీలుగా పనులకు శ్రీకారం చుట్టాం. వైయస్ఆర్ సీపీ ప్రభుత్వంలోనే డెబ్బై శాతం పనులు కూడా పూర్తి చేశాం. దాని మిగిలిన పనులను పూర్తి చేస్తామని చంద్రబాబు తన పర్యటనలో ఒక్క మాట కూడా చెప్పలేదు.

రాయచోటి ప్రాంతానికి వచ్చిన సందర్భంగా ఒక్క విద్యాసంస్థను కూడా ప్రకటించలేదు. మహిళా జూనియర్ కాలేజీ, మహిళా డిగ్రీ కాలేజీ, రెండో ఇంజనీరింగ్ కాలేజీ, పాలిటెక్నిక్ కాలేజీ లను వైయస్ఆర్, వైయస్ జగన్ హయాంలో సాధించుకున్నాం. రాయచోటిలో కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీ కోసం ఇప్పటికే 80 ఎకరాలు భూమిని కూడా సేకరించి సిద్దంగా ఉంచాం, ఈ కాలేజీని ప్రైవేటీకరించ వద్దంటూ విద్యార్ధులు ప్రశ్నిస్తే, వారిని సంఘ విద్రోహశక్తులు అంటూ నిందిస్తారా?

యూనివర్సిటీకి నిధులు, కొత్త కలెక్టరేట్ భవనాలు, గండికోట నుంచి నీటని అందించే ప్రాజెక్ట్ వంటి వాటిపై చంద్రబాబు మాట్లాడతారని అందరూ అనుకున్నారు. కానీ ఎప్పటిలాగానే చంద్రబాబు తన నిజస్వరూపాన్ని చాటుకున్నారు. ఈ ప్రాంత ప్రజలను మోసగించారు. మభ్యపెట్టే మాటలతో ప్రజలను వంచించారు.

ఈ రోజు అన్ని అవకాశాలు ఉన్నా, కేంద్రంలో భాగస్వామిగా ఉండి కూడా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయడం లేదు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్నారు. ఈ ఎనిమిది నెలల్లో ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. కోటిన్నర మందికి పైగా అర్హులైన మహిళలు చంద్రబాబు ఇచ్చిన హామీని ఎప్పుడు నెరవేరుస్తారని




ప్రశ్నిస్తున్నారు. యాభై ఏళ్ళు దాటిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పెన్షన్ ఇస్తామన్నారు. నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు ఇస్తామన్నారు. ఈ ఏడాది రైతుభరోసా ఎందుకు ఇవ్వలేకపోతున్నారు.

ఏడు నెలలు ఇన్ ఫ్లో ఉన్న కష్ణానదిలో ఈ రోజు డెడ్ స్టోరేజీ స్థాయికి నీటిని తోడేశారు.

రాయలసీమకు ఎలా నీరు ఇస్తారో చంద్రబాబు చెప్పాలి. గతంలో పట్టిసీమ నుంచి రాయలసీమకు నీరు ఇస్తానంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నారు. ఎలా ఇస్తారో చెప్పండి అంటే దానిపై మాట్లాడరు.

ఇప్పుడు కొత్తగా బనకచర్ల అంటూ కొత్త పల్లవి అందుకున్నారు. బనకచర్ల క్రాస్ నుంచి సరైన అవగాహన చంద్రబాబుకు లేదు. దీనిని ఎలా పూర్తి చేస్తారో చంద్రబాబు చెప్పగలరా? రాష్ట్ర ప్రజలకు కీలకమైన పోలవరం ప్రాజెక్ట్ ఎత్తు కుదిస్తున్నా చంద్రబాబు మాట్లడటం లేదు. పోలవరం నుంచి కృష్ణా బ్యారేజీకి, అక్కడి నుంచి ప్రకాశం జిల్లాకు, అక్కడి నుంచి వెలుగొండ ద్వారా బనకచర్ల క్రాస్ కు నీటిని తరలిస్తారో సరైన ప్రణాళిక ఉందా? మీడియా సమావేశం అనంతరం ఈనెల 5న పార్టీ తలపెట్టిన ఫీజు పోరు పోస్టర్‌ను పార్టీ సీనియర్ నేత ఆకెపాటి అమర్నాథ్‌రెడ్డితో కలిసి గడికోట శ్రీకాంత్ రెడ్డి ఆవిష్కరించారు.

## కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం

- గురజాడ పేరు ప్రస్తావన తప్ప ఒరిగింది శూన్యం
- పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గిస్తున్నారు
- ఉత్తరాంధ్ర, రాయలసీమకు తీవ్ర నష్టం
- అయినా చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ స్వాగతించడం దారుణం
- మొదటి ఏడాది ఇవ్వాల్సిన పథకాలన్నీ ఎగ్గొట్టేసినట్టే
- చంద్రబాబు మోసం చేస్తాడని జగన్ చెబుతూనే ఉన్నారు
- విశాఖపట్నంలోని క్యాంప్ ఆఫీస్‌లో మీడియాతో మాట్లాడిన శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ



విశాఖపట్నం: ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని, ఒక్క గురజాడ పేరు ప్రస్తావన తప్ప రాష్ట్రానికి ఒరిగింది శూన్యం అని శాసన మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ ధ్వజమెత్తారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గిస్తున్నారన్న ఆయన, అది బడ్జెట్ నిధుల కేటాయింపులో స్పష్టమైందని చెప్పారు. అదే జరిగితే ఉత్తరాంధ్ర, రాయలసీమకు తీవ్ర నష్టం జరుగుతుందని స్పష్టం చేశారు. అయినా సీఎం చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ స్వాగతించడం దారుణమని చెప్పారు.దఎన్డీఏలో భాగస్వామిగా ఉంటూ, 16 మంది ఎంపీల మద్దతిచ్చి చంద్రబాబు సాధించిందేంటి? అన్న బొత్స, 12 మంది ఎంపీలతోనే బడ్జెట్‌లో బీహార్‌కి భారీగా లబ్ధి పొందారని గుర్తు చేశారు. చంద్రబాబు అసమర్థత మరోసారి బట్టబయలైందన్న ఆయన, పోర్టుల నిర్మాణానికి కూడా ఒక్క రూపాయి తేలేకపోయారని తెలిపారు. ఇంకా మెడికల్ కాలేజీల సేఫ్ క్లోజ్‌తో ఎంతో నష్టపోతున్నామని విశాఖలో మీడియాతో మాట్లాడిన బొత్స సత్యనారాయణ తేల్చి చెప్పారు.

. బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం జరుగుతున్నా కూటమిలో ఉన్న చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ స్పందించకపోవడం, పైగా కేంద్ర బడ్జెట్‌ను స్వాగతించడం చూస్తుంటే అనేక అనుమానాలు కలుగుతున్నాయి. పోలవరం పూర్తి కావడానికి నిధులు కేటాయించామని చెప్పినందుకు సంతోషపడాలో, పోలవరం ఎత్తు తగ్గించి బ్యారేజీగా మారుస్తున్నందుకు బాధపడాలో అర్థం కావడం లేదు. పోలవరం ఎత్తు 41.15 మీటర్ల ఎత్తుకు కుదిస్తున్నట్టు బడ్జెట్ కేటాయింపులతో స్పష్టమైంది.

అయితే పోలవరం ఎత్తు తగ్గుతున్నందుకు టీడీపీలో ఏమాత్రం బాధ కనిపించడం లేదు. ప్రాజెక్టు ఎత్తు తగ్గిస్తే వెనుబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. పోలవరం ఎత్తు తగ్గింపు విషయంపై కూటమిలో ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు ప్రజలకు సమాధానం చెప్పాలి. దీనిపై త్వరలోనే మేధావులు, నీటి పారుదల ప్రాజెక్టు నిపుణులతో మాట్లాడతాం.

తనకు సంపద సృష్టించడం తెలుసని, అందుకే అన్ని పథకాలు కచ్చితంగా అమలు చేస్తామని ఆనాడ నమ్మబలికిన చంద్రబాబు, ఇప్పుడు చేతులెత్తేసి, సంపద సృష్టికి సలహా కోరుతున్నారు. చంద్రబాబుని నమ్మితే కొండచిలువ నోట్లో తల పెట్టడమేనని ఎన్నికల ముందు జగన్ చాలాసార్లు చెప్పారు. అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తారని కూడా అన్నారు. ఇప్పుడు సరిగ్గా అదే జరిగింది.

రాజకీయాలకు స్వస్తి పలకడం అనేది అనేది విజయసాయిరెడ్డి గారి వ్యక్తిగత నిర్ణయం.

జగన్ చిత్తశుద్ధితో కృషి చేయడం వల్లనే విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగిపోయింది. ఇదే విషయాన్ని ప్లాంట్‌కు రూ.11 వేల కోట్ల ప్యాకేజీ ప్రకటన సందర్భంగా ఉక్కు శాఖ మంత్రి వెల్లడించారు. ఇప్పటికీ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై తమకు అనుమానం ఉందని.. అందుకు కారణం.. దానిపై కేంద్రం స్పష్టంగా ప్రకటన చేయకపోవడమే అని బొత్స సత్యనారాయణ వివరించారు.



## ఆర్థిక పురోభివృద్ధికి దోహదపడే కేంద్ర బడ్జెట్

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

నందిగామ : కేంద్ర బడ్జెట్ పూర్తిగా ఆర్థిక పురోభివృద్ధికి దోహదపడే విధంగా ఉందని అభిప్రాయపడిన ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య బడ్జెట్లో అన్ని రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారని వెల్లడించారు. బడ్జెట్లో మధ్యతరగతి ప్రజలు, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారు అని తెలిపారు. దీర్ఘ ఫలాలు వచ్చేలా ఇప్పటి నుంచే ప్రణాళికలు వేశారని, అందుకే బడ్జెట్లో అన్ని రంగాలకు పెద్ద పీట వేశారని వివరించారు. బడ్జెట్ ద్వారా అన్నదాతలకు మేలు జరగనుందని వ్యక్తం చేశారు. ఎంఎస్ఎంఈలకు ఇచ్చే రుణాలు రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లకు పెంచడం, స్టార్టప్‌లకు రూ.10 కోట్లు నుంచి రూ.20 కోట్లకు పెంచడం శుభపరిణామమన్నారు. ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన మహిళలకు టర్మ్‌లోన్ పథకం ద్వారా రుణాలు, ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించడం మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు.

## విద్యతోనే బీసీల అభ్యున్నతి

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

మంగళగిరి: విద్యతోనే బడుగు, బలహీన వర్గాలు అభ్యున్నతి సాధ్యమవుతుందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖమంత్రి ఎస్.సవిత తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం క్యాలెండర్ ను మంగళగిరిలోని ఓ కన్వెన్షన్ సెంటర్లో మంత్రి సవిత ఆదివారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బీసీ సంక్షేమ శాఖను అప్పగించి, సీఎం చంద్రబాబునాయుడు తనపై గురుతర బాధ్యతలు పెట్టారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో పాటు విద్యలోనూ బీసీ బిడ్డలు రాణించాలని, ఆనాడే పాలించే స్థాయికి చేరుకోగలమన్నారు. వెనుకబడిన తరగతుల సమస్యల



పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో తమ ప్రభుత్వం చేపట్టిన పథకాలను చెప్పలేపోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, టీడీపీ నాయకులు కేసన శంకరరావు, బీసీ సంక్షేమ సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సువర్ణాక్షరాలతో లిఖించిన రోజు

- మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్: ప్లానింగ్ డిపార్ట్మెంట్ తెలంగాణ ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక సువర్ణాక్షరాలతో లిఖించిన రోజు. ఫిబ్రవరి 4,2024 నాడు క్యాబినెట్ లో తీసుకున్న నిర్ణయం ప్రకారం అనేక దశలను అధిగమించి తెలంగాణ ప్రభుత్వం తరపున ఒక ప్రతినిధి ప్రతి ఇంటికి చేరు సమాచారాన్ని సేకరించడానికి వ్యవస్థ. అనేక రకాలుగా అడ్డం తగిలి ప్రక్రియ సజావుగా జరగకుండా ఉండడానికి అనేక దుష్ప్రచారం జరిగింది. ప్రభుత్వం చిత్తశుద్ధిని గమనించిన యావత్ తెలంగాణ ప్రజలు సహాయ సహకారాలు అందించారు. ప్రభుత్వానికి ఒక నివేదిక సేకరించే డేటా అవకాశం కల్పించిన తెలంగాణ బలహీన వర్గాల మేదావులు, సంఘాలు ఈ కార్యక్రమాన్ని కొనసాగించడానికి స్ఫూర్తి ప్రధాతలైన వారందరినీ అభినందిస్తున్న.దఫిబ్రవరి 16 2024 శాసన సభ లో బలహీన వర్గాల శాఖ మంత్రిగా తీర్మానాన్ని ప్రవేశ పెట్టాను. అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాన్ని తీసుకున్నాం. బీసీ కమిషన్ దగ్గర అంత ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఉండదు కాబట్టి.. ప్లానింగ్ డిపార్ట్మెంట్‌కి బాధ్యతలు అప్పగించా. లక్ష పైన ఎన్యుమరెటర్లు , పరిశీలకులను ఏర్పాటు చేసి తెలంగాణా ప్రభుత్వం ప్లానింగ్ డిపార్ట్మెంట్ ద్వారా ఈ సర్వే కార్యక్రమం నిర్వహించింది.

ఇది చారిత్రాత్మక కార్యక్రమం. మా నాయకుడు రాహుల్ గాంధీ చెప్పినట్టు దేశానికి మార్గదర్శకత్వంగా జిత్నే అబాది ఉత్నే ఇస్సేదారి .. ఎవరెంత వారికంత అవసరమైతే నిబంధన ఎత్తివేసి న్యాయం జరగాలని తెలంగాణ ప్రభుత్వం ఈ కార్యక్రమం తీసుకుంది. బలహీన వర్గాల్లో సామాజిక , రాజకీయ,ఆర్థిక, విద్యా ఉపాధి అవకాశాల్లో ప్రభుత్వం తరపున సరైన పథకాలు అందేలా ప్రభుత్వం దగ్గర నివేదిక ఉంది. రాజకీయ ప్రేరేపణ కోసమో ఆ వర్గా లకు న్యాయం జరిగేలా నివేదిక తీసుకొని కార్యక్రమాలు కొనసాగిస్తాం. అనేక ఒడిదుడుకులు అధిగమించి ఇంటింటికీ వెళ్లి సమాచారాన్ని సేకరించిన వారికి అభినందనలు.

4 ఫిబ్రవరి 2024, నుండి 4 ఫిబ్రవరి 2025 సంవత్సర కాలంలోనే పూర్తి చేసుకుంది ప్రభుత్వ కమిట్మెంట్. తెలంగాణ యావత్ బలహీన వర్గాల ప్రజలు సంఘాలు మేదావులు ఆలోచన చేయాలి. నివేదిక కే పరిమితం కాదు. క్షేత్ర స్థాయిలో ఫలాలు అందించే దానిపై అందరి సలహాలు సూచనలు తీసుకుంటాం. దేశానికే మార్గదర్శకంగా తెలంగాణ ప్రభుత్వం నిలిచింది. ముఖ్యమంత్రి ,ఉప ముఖ్యమంత్రి,సహచర మంత్రులు , మేధావులకు హృదయ పూర్వక ధన్యవాదాలు.

జనం గుండె చప్పుడు

మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 03, ఫిబ్రవరి 2025 ||

# ఆలపాటి విజయానికి కృషి చేయాలి

◆ బుచ్చి రాంప్రసాద్

మచిలీపట్నం, మహానాడు: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బ్రాహ్మణ సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్ ఆదివారం మచిలీపట్నం నగరంలో పలువురు బ్రాహ్మణులను కలివారు.

తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి బలపరిచిన పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం రాంప్రసాద్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ పట్టభద్రులు అందరూ వేసే ఓటు స్వార్థపర శక్తులకు అవకాశం కల్పించేదిగా కాకుండా భావితరాల భవిష్యత్తుకు బంగారు బాట వేసేదిగా ఉండాలన్నారు.



పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి మంచి వ్యక్తి అని కష్టపడి పనిచేసే తత్వం ఉన్న వ్యక్తిగా పట్టభద్రుల ఎమ్మెల్సీ గా గెలిస్తే రాష్ట్ర భవిష్యత్తుకు చంద్రబాబు, పవన్ కల్యాణ్ తో కలిసి ఎమ్మెల్సీగా ప్రజా సమస్యల పరిష్కారంతోపాటు, పట్టభద్రుల సమస్యలకు కూడా చక్కటి రూపకల్పన చేస్తారన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ కృష్ణాజిల్లా ప్రచార కార్యదర్శి, తెలుగుదేశం పార్టీ బ్రాహ్మణ సాధికార కమిటీ కృష్ణాజిల్లా కన్వీనర్, పి. వి. ఫణి కుమార్, సురేష్ బాబు, వరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి పనులను పరిశీలించిన భట్టి విక్రమార్క



వైరా: స్నానాల లక్ష్మీపురం గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధి పనులను ఆదివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పరిశీలించారు. ఇందిరమ్మ రాజ్యం ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామంలోని చారిత్రాత్మకమైన ఈ దేవాలయానికి వచ్చేటువంటి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించడానికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక దృష్టి సారించారు.

ఇందులో భాగంగా మూడు కోట్ల 20 లక్షల రూపాయలతో అభిషేక మండపం, కళ్యాణ మండపం, వేదిక, కాటేజీలు, టాయిలెట్స్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆలయ పరిసర ప్రాంతాలను కలియ తిరుగుతూ ప్రతి కట్టడాన్ని నిశితంగా పరిశీలించారు. ఇప్పటి వరకు జరిగిన పనులు గురించి ఆరా తీశారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తయ్యే విధంగా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వైరా శాసనసభ్యులు రామదాసు నాయక్, డిసిసి అధ్యక్షులు పువ్వాల దుర్గాప్రసాద్, కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యం, పీసీసీ ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

### అంబేద్కర్ విగ్రహం సాక్షిగా

# బీజేపీపై యుద్ధం ప్రకటిస్తున్నా..

- ◆ దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5.1 శాతం
- ◆ 2.10 శాతమే తిరిగి వస్తోంది
- ◆ తెలంగాణ ప్రజలు బీజేపీని ఎప్పటికీ క్షమించరు
- ◆ టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్
- ◆ కేంద్ర ప్రవేశపెట్టిన బడ్జెట్లో తెలంగాణకు అన్యాయం జరిగిందంటూ ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నిరసన



హైదరాబాద్: డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం సాక్షిగా తెలంగాణపై కేంద్రం వైఖరికి నిరసనగా బీజేపీపై యుద్ధం ప్రకటిస్తున్నా. కేంద్ర నిధులు ఇచ్చే వరకు శాంతియుతంగా పోరాటం చేస్తాం ఇద్దరు కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డికి రాష్ట్ర అభివృద్ధి పట్టదా? తెలంగాణ కోసం సీఎం రేవంత్, మంత్రులు ఒంటరి పోరాటం చేస్తున్నారు బిజెపి పార్టీ నుంచి 8 మంది ఎమ్మెల్యేలు, 8 ఎంపీలు ఉంటే కేంద్రం తెలంగాణకు గాడిదగుడ్డు ఇచ్చింది.

బడ్జెట్ కేటాయింపులు ఢిల్లీ, బీహార్ ఎన్నికల కోసమే అన్నట్లుగా ఉంది. కొన్ని రాష్ట్రాలకే బడ్జెట్ కేటాయింపులతో వికసిత్ భారత్ ఎలా సాధ్యం? దేశ జీడీపీలో 5.1 శాతం వాటా ఉన్న తెలంగాణకు 2.10 శాతమే తిరిగి వస్తోంది. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అని గొప్పలకు పోయే బీజేపీకి దేశంలో ఉన్న 140 కోట్ల ప్రజలు, వారి సమస్యలు కనపడకపోవడం విడ్డూరం. 2025-26 బడ్జెట్ కేటాయింపులు చూసి తెలంగాణ ప్రజలు బీజేపీని ఎప్పటికీ క్షమించరు. రాష్ట్ర నిధుల కోసం సీఎం రేవంత్, మంత్రులు ఢిల్లీకి వెళ్లి ప్రధాన మంత్రిని కలిసి యాచించిన తెలంగాణకు ఒరిగింది ఏమి లేదు.

# కూటమి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోంది...

- ◆ వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపణ
- ◆ ఎన్నికల కమిషనర్‌కు వినతిపత్రం

విజయవాడ, మహానాడు: ఇక్కడి రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నిని వైఎస్సార్‌సీపీ నేతలు ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. మునిసిపల్ కార్పొరేషన్‌లు, మునిసిపాలిటీలలో జరగనున్న ఉప ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని వైఎస్సార్‌సీపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ చేస్తున్న దౌర్జన్యకాండను అడ్డుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని ఆ పార్టీ నేతలు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను కోరారు. వైఎస్సార్‌సీపీకి సంపూర్ణ మెజారిటీ ఉన్నా అక్రమాలు, దాడులు, దౌర్జన్యాలతో అధికార టీడీపీ నేతలు సాగిస్తున్న అరాచకాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్ళినట్టు ఆ పార్టీ నేతలు వెల్లడించారు. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీలు అప్పిరెడ్డి, రహుల్లా, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్, విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అంకంరెడ్డి నారాయణమూర్తి, వైఎస్సార్సీపీ ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, పలువురు సీనియర్ నాయకులు ఎన్నికల కమిషనర్ ను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు ఏమన్నారంటే... తిరుపతిలో డిప్యూటీ మేయర్ ఎన్నిక జరగనుంది. మా పార్టీ తరుపున శేఖర్ రెడ్డి అనే వ్యక్తిని అభ్యర్థిని ప్రకటిస్తే అతని ఆస్తులను ధ్వంసం చేశారు. ఏ విధమైన నోటీస్ లేకుండా దుర్మార్గంగా అతని భవనాలు కూల్చేసి భయభ్రాంతులకు గురిచేశారు. అతను పోటీచేయడానికి వీల్లేదని బెదిరించారు. తిరుపతి మేయర్ శిరీష వెళితే ఆమెను అడ్డుకున్నారు. చంద్రబాబు బహిరంగంగా రాజీనామాలు చేసి వస్తేనే మా పార్టీలో చేర్చుకుంటామని అనేక సందర్భాలలో చెప్పారు. కార్పొరేటర్ల విషయంలో అది వర్తించదా, మా పార్టీ గుర్తుపై గెలిచిన వారిని ప్రలోభపెట్టి లాక్కోవడం దుర్మార్గమని ఆయన అన్నారు.

మేం విప్ కూడా జారీ చేశాం, అది ఉల్లంఘిస్తే డిస్క్వాలిఫై అవుతారు. నిజాయితీ గా పనిచేసే అధికారులను నియమించి ఎన్నికలు సజావుగా నిర్వహించాలని ఎన్నికల కమిషనర్‌గారిని కోరాం. ఈ రోజు ఉదయం ముద్రగడ పద్మనాభం ఇంటిపై దాడిచేసి అరాచకం సృష్టించారు. తీరా అతను నేను పిఠాపురం ఎమ్మెల్యే తాలూకా అంటున్నారు. నేను పిఠాపురం ఎమ్మెల్యేకి ఒక విజ్ఞప్తి, అయ్యా ఇలాంటి దౌర్జన్యాలను మీరు ప్రోత్సహించడం సమంజసం కాదు, మీరు తక్షణమే దీనిపై స్పందించాలి. మీకు ముద్రగడ పద్మనాభం అంటే గిట్టకపోవచ్చు కానీ ఇది ఖండించకపోతే ప్రజాస్వామ్యంలో మీరు దౌర్జన్యాలను ప్రోత్సహించినవారు అవుతారు. దీనిని అందరూ ఖండించాలి. కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాలి. పోలీసులు కూడా కఠినంగా వ్యవహరించాలని నూతన డీజీపీని కోరుతున్నానని రాంబాబు అన్నారు.



వెలంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ అధికార పార్టీ నేతలు మా అభ్యర్థులను బెదిరించడం, ప్రలోభపెట్టడం, లొంగనివారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నిన్న తిరుపతి డిప్యూటీ మేయర్ అభ్యర్థి ఇంటిని కూల్చడం అందరికీ తెలిసిందే. మేం ఎన్నికల కమిషనర్ ని కలిసి పారదర్శకంగా ఎన్నికలు జరపాలని, ప్రతి అభ్యర్థికి భద్రత కల్పించాలని వినతిపత్రం అందజేశాం. చంద్రబాబు మీ సిద్ధాంతాలు ఏమయ్యాయి?దొడ్డిదారిన పదవులు పొందాలన్న తాపత్రయం ఎందుకు?అవన్నీ మా వైఎస్సార్‌సీపీవే కదా, మీకు ఇంకా అధికార దాహం తీరలేదు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదు. స్థానిక సంస్థల్లో మా గొంతు నొక్కే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారు? మీకు బలం లేని చోట ఎందుకు పోటీకి దిగుతున్నారు? ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఎన్నికల కమిషన్‌కు వినతిపత్రం అందజేశామని ఆయన తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, విజయవాడ ఈస్ట్ వైఎస్సార్‌సీపీ ఇంఛార్జ్ దేవినేని అవినాష్, విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి కూడా మాట్లాడారు.

# ఢిల్లీ గద్దె బీజేపీదే!

◆ ఢిల్లీ ప్రజల ఆప్ ఆపదను బిజెపినే గట్టెక్కిస్తుంది

గత పది సంవత్సరాలుగా దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన అవినీతిని చీపురుతో తుద ముట్టిస్తానని, చిమ్మి వేస్తానని ప్రగల్భాలు పలికి గత రెండుసార్లు సామాన్య ప్రజలను నమ్మించారు అధికారంలోకి వచ్చారు. మూడోసారి అధికారం కోసం అర్రులు చాస్తున్నారు.

ఈసారి ఢిల్లీ ప్రజలు మోసపోరని స్పష్టంగా కొన్ని సర్వేలు చెబుతున్నాయి.

వివరాల్లోకెళ్తే గత రెండుసార్లుగా ఇన్ డైరెక్ట్ గా బిజెపి గెలవకుడదని దేశంలో కల్లా అతి పెద్ద జాతీయ పార్టీ మాదేనని ప్రగల్భాలు పలుకుతున్న కాంగ్రెస్ పార్టీ,బిజెపిని అధికారంలోకి రానివ్వకుండా సమాజ్వాది పార్టీ, ఎంఐఎం పార్టీ చిన్నాచితక పార్టీలన్నీ కలిపి ఆప్ ను అధికారానికి తెచ్చాయి.

ఆప్ ఢిల్లీలో గెలిచిన తర్వాత.. పక్కన రాష్ట్రం పంజాబ్ లో కాంగ్రెస్ పార్టీ బలంగా అధికారంలో ఉన్న పరిస్థితి నుండి, ఆప్ అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ ఆలస్యంగా మేలుకుంది. ఈసారి తప్పును తెలుసు కున్న కాంగ్రెస్ పార్టీ గతంలో ఢిల్లీ ఎన్నికల్లో మూడుసార్లుగా షీలా దీక్షిత్ నాయకత్వంలో అధికారంలో ఉన్నది గుర్తు చేసుకుని, తిరిగి వారు ఎన్నికల రంగంలో క్రియాశీలకంగా ఉండేందుకు ప్రయత్నం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకయిన ఢిల్లీ స్లమ్స్‌లో, ఎస్సీ 12 నియోజక వర్గాలలో ఆప్‌కు వ్యతిరేకంగా అభ్యర్థులను నిలబెట్టి గెలుపుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

సుమారుగా 7,8 నియోజకవర్గాలలో ముస్లిం ఓట్లు అధికంగా ఉన్న ప్రాంతాలలో, గతంలో ఆప్ కు సపోర్ట్ చేసిన ఎంఐఎంపార్టీ అభ్యర్థులను నిలబెట్టి గెలుపుకు ప్రయత్నం చేస్తున్నారు. ఢిల్లీ చుట్టుపక్కల గ్రామాలలో ఉత్తరప్రదేశ్, బీహార్ ప్రజలు, రైతు ఉద్యమం పేరుతో బీజేపీకి వ్యతిరేకంగా గత రెండు సార్లుగా వారు బిజెపికి వ్యతిరేకంగా ఓటు వేసి ఆఫ్ గెలుపుకు దోహద పడ్డారు. అయితే 7,8 ముస్లిం నియోజకవర్గాలైన ఓటర్లకు మొన్న శుక్రవారం జరిగిన మసీదులలో ప్రార్ధనలలో ఈసారి మన ముస్లిం ప్రజలంతా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని బహిరంగంగానే ప్రకటన చేశారు . పంజాబ్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఆప్ కు పెద్ద దెబ్బ తగిలింది. చండీగఢ్ కార్పొరేషన్ కు జరిగిన మేయర్ ఎన్నికల్లో మేయరు స్థానాన్ని బిజెపి, సీనియర్ డిప్యూటీ మేయర్ డిప్యూటీ మేయర్ స్థానాలను కాంగ్రెస్ వశం చేసుకుంది. గతంలో ఆప్ పార్టీ అభ్యర్థి మేయర్ గా ఉండేవాడు.

ఆప్ పార్టీ గతంలో గెలిచిన ఎమ్మెల్యేలను 20 మందికి టికెట్లు ఇవ్వకుండా మార్చి వేశారు. వారిలో ఏడు మంది బహిరంగంగానే అరవింద్ కేజ్రీ వాల్ రోడ్ షో నిర్వహిస్తున్న సమయంలో సెక్రటేరియట్లో సమావేశం ఏర్పాటు చేసి ఆప్ పార్టీ కి రాజీనామా చేసి, ఆప్ పార్టీకి గతంలో అనుకున్న ఆదర్శాలు ఇప్పుడు లేవని.. పూర్తిగా అవినీతి



మయమైపోయిందని, లిక్కర్ స్కామ్ లో ఇరుక్కుందని మేము ఎన్నికల్లో ఆప్ కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నామని పత్రికల్లో ప్రకటనలు చేశారు. ఆ నియోజకవర్గాలు 1. మోహర్లీ కి చెందిన నరేష్ యాదవ్,2 త్రిలోక్ పురి ఎమ్మెల్యే రోహిత్ కుమార్ 3. జనక్ పురికి చెందిన ఎమ్మెల్యే రాజేష్ ఋషి , 4. కస్తూరిబానగర్ ఎమ్మెల్యే మదన్ లాల్ 5. ఆదర్శనగర్ చెందిన ఎమ్మెల్యే పవన్ శర్మ, 6. పాలంకి కి చెందిన ఎమ్మెల్యే భావనకౌర్ రాజీనామా చేశారు 7. బిజువాసన్ కు చెందిన డిఎస్ డోన్ గతంలోని రాజీనామా చేశారు.

ఢిల్లీలో నివసించే పేద ప్రజలను, మురికి వాడలను అభివృద్ధి చేయటం బిజెపి చెప్పిన మేనిఫెస్టో ప్రకారం.. బిజెపినే చేయగలదని నమ్మకం ఆ ప్రజల్లో వచ్చేసింది. మరియు గత 3 సార్లు గా దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ ఖచ్చితంగా ఈసారి ఢిల్లీ రాష్ట్రం గెలవాలని, రాష్ట్రం, కేంద్రం ఒకే పార్టీ అధికారంలో ఉంటే మన సమస్యలు సులభంగా పరిష్కారం అవుతాయని,మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల్లో తల్లి కార్యకర్తలు స్వార్థం అనే మాట లేకుండా దేశం కోసం ఏ విధంగా అహర్నిశలు కష్టపడి పనిచేసి బిజెపిని గెలిపించారో , అదేవిధంగా ఢిల్లీలో కూడా రాత్రింబవళ్లు శక్తి వంచన లేకుండా, కష్టపడుతూ, ఢిల్లీ ప్రజలకు వాస్తవాలు చెబుతూ, నమ్మిస్తూ, బిజెపిని గెలిపించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదంతా చూసిన తర్వాత ఢిల్లీ ప్రజలు దేశం మొత్తం బిజెపి వాతావరణం, 20 రాష్ట్రాలలో అధికారం, 2047 కల్లా దేశాన్ని వికసిత్ భారత్ గా తీసుకురావాలనే మోడీ సంకల్పంతో, 140 కోట్ల ప్రజల అండదండలతో, లక్ష్యంతో, బాసటగా నిలిచి బిజెపితో చేతులు కలిపేందుకు తద్వారా బిజెపిని ఢిల్లీలో గెలిపించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఫిబ్రవరి ఒకటో తారీకున ప్రవేశ పెట్టిన బడ్జెట్ అంశాలను కూడా దృష్టిలో పెట్టుకొని బడ్జెట్ గురించి ఎప్పుడూ లేనిది రకరకాల మేధావి సంఘాలు, విశ్లేషకులు, రాజకీయ పండితులు ఈ బడ్జెట్ ద్వారా ఈ దేశం ప్రపంచ దేశాల కల్లా త్వరలో మూడో స్థానానికి చేరుతుందని నమ్మి బాసటగా ఢిల్లీలో 7 పార్లమెంటు సీట్లు గెలిపించారో అదేవిధంగా గెలిపించాలని నిర్ణయం చేసుకున్నారనిపిస్తుంది .

- కరణం భాస్కర్

- రాష్ట్ర బిజెపి సీనియర్ నాయకులు,

7386128877.

# లోయలో పడ్డ బస్సు ఏడుగురు మృతి

◆ 15మందికి గాయాలు

నాసిక్-సూరత్ హైవేలోని సపుతర ఘాట్ వద్ద ఈ ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. 50 మంది భక్తులతో వెళ్తున్న లగ్జరీ ప్రైవేట్ బస్సు అదుపు తప్పి 200 అడుగుల లోతైన గుంతలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు. కాగా, 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం చాలా తీవ్రంగా ఉండటం వల్ల బస్సు కిందపడిన వెంటనే ముక్కలుగా విరిగిపోయింది.

గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రిలో చేర్చారు. సమాచారం ప్రకారం, భక్తులతో నిండిన ఈ బస్సు కుంభమేళా నుండి వస్తోంది. గుజరాత్‌లోని మతపరమైన ప్రదేశాలను సందర్శించడానికి వెళుతోంది. ఇంతలో ఈ ప్రమాదం సపుతరలోని మాలేగావ్ ఘాట్ సమీపంలో జరిగింది.

ఉదయం 5:30 గంటల ప్రాంతంలో, నాసిక్-సూరత్ హైవేలోని సపుతర ఘాట్ సమీపంలో ఒక ప్రైవేట్ బస్సు అదుపు తప్పి 200 అడుగుల లోతైన లోయలో పడిపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే అరుపులు, కేకలు వినిపించాయి. బస్సు ప్రమాదాన్ని చూసిన చుట్టుపక్కల



ప్రజలు వెంటనే గాయపడిన వారికి సహాయం చేయడానికి ముందుకు వచ్చారు. పోలీసులకు కూడా సమాచారం అందించారు. ప్రమాదంలో మృతి చెందిన ప్రయాణికులందరూ మధ్యప్రదేశ్‌కు చెందినవారు. కుంభమేళా తర్వాత ఆయన నాసిక్‌లోని త్రయంబకేశ్వర్ ఆలయానికి వెళ్ళారు. దీని తరువాత వారంతా దేవ దర్శనం కోసం గుజరాత్ వెళు న్నారు.

# పద్మారావుతో సమావేశమైన మంద కృష్ణ మాదిగ



సికింద్రాబాద్: ఇటీవల గుండె పోటుకు గురై కోలుకున్న సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్‌ను ఎం.ఆర్.పీ.ఎస్. వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ ఆదివారం మోండా మార్కెట్ లోని ఆయన నివాసంలో కలుసుకొని పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

అదే విధంగా ఈ నెల 7 వ తేదిన తన ఆధ్వర్యంలో ఎల్.బీ.స్టేడియం నుంచి నిర్వహించే వేల గొంతుకలు, లక్ష డప్పులు కార్యక్రమానికి మద్దతు తెలపాలని మంద కృష్ణ మాదిగ ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ ను కోరారు. అందుకు పద్మారావు గౌడ్ సానుకూలంగా స్పందించి మద్దతు తెలిపారు.

కార్యక్రమంలో అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్న లక్ష్మి శ్రీనివాస్ తో పాటు యువ నేతలు కిషోర్ కుమార్, రామేశ్వర్ గౌడ్, బీ.ఆర్.ఎస్. నాయకుడు లింగాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మతనానికే మచ్చతెచ్చిన కన్నతల్లి!

- ◆ ఆకలికి తట్టుకోలేక చెత్త డబ్బా వద్ద ఆహారం తిన్న బాలిక
- ◆ స్థానికుడి ఫిర్యాదుతో రంగంలోకి పోలీసులు, ఐసీడీఎస్‌సిబ్బంది

సత్తెనపల్లి, మహానాడు: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని కన్నపేగు పట్ల ఓ తల్లి కర్కశత్వం ప్రదర్శించింది. ఐదు రోజులుగా పసిబిడ్డకు అన్నం పెట్టకుండా కడుపు మాడ్చింది ఆ కన్నతల్లి. అమ్మ అన్నం పెట్టని అడిగిన కన్నా కూతురికి అన్నం బదులుగా పెద్ద అట్లకాడతో ఒళ్లంతా వాతలు పెట్టింది. ఆకలి గొన్న పసిబిడ్డ రైల్వే స్టేషన్ రోడ్డు పక్కన ఉన్న డస్ట్ బిన్లలో ఆహారం వెతుక్కుని తింటుండగా స్థానికుడు గమనించి 1098కి ఫిర్యాదు చేయడంతో ఈ దుర్భర ఘటన వెలుగుచూసింది. పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బంది కథనం మేరకు.. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో నివాసముంటున్న మాధవి భర్త నాలుగేళ్ల కిందట చనిపోయాడు. ఆమెకు ఆరేళ్ల కుమార్తె ఉంది. శివపార్వతి అనే మహిళ ఇంట్లో అద్దెకు ఉంటోంది. మాధవి ఓ వ్యక్తితో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తుండగా, ఆమెకు శివపార్వతి సహకరిస్తోంది. ఆ బంధానికి బిడ్డ అడ్డుగా ఉందని భావించిన మాధవితో పాటు శివపార్వతి బాలికను చిత్రహింసలకు గురిచేస్తున్నారు. ఐదు రోజులుగా అన్నం పెట్టలేదు. ఆకలేస్తుందని అడిగితే అట్లకాడతో వాతలు పెట్టారు.

స్థానికుడి ఫిర్యాదు మేరకు వెంటనే ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా కానిస్టేబుల్ ఆ పాప ఇంటికి వెళ్లారు. వీరి రాకను చూసిన శివపార్వతి.. వారి పైకి పెంపుడు కుక్కను ఉసిగొల్పింది. మాధవికి పెళ్లే కాలేదని, ఆమెకు కూతురు ఎక్కడిదని బుకాయించింది. తర్వాత వారిద్దరిని పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించడంతో గుట్టు రట్టయింది. బాలిక శరీరంపై ఉన్న వాతలు, దెబ్బలు చూసిన పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బంది విస్మయం చెందారు బాలికను నరసరావుపేటలోని శిశుగృహకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

# చంద్రబాబు కృషి, మోదీ సహకారంతోనే రాష్ట్రానికి నిధులు

◆ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, మహానాడు: ఎన్డీయే బంధం, సీఎం చంద్రబాబు కృషి, రాష్ట్రం పట్ల ప్రధాని మోదీ ప్రత్యేక ఆదరణ బడ్జెట్ కేటాయింపుల రూపంలో మరోసారి స్పష్టంగా కనిపించిందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. కూటమిపై రాష్ట్ర ప్రజలు పెట్టుకున్న అపారమైన నమ్మకం, అందించిన అఖండ విజయం కేంద్ర నుంచి నిధుల రూపంలో వరదగా తిరిగి వస్తోందన్నందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టుకు గతేడాది ఇచ్చిన రూ. 5,512 కోట్ల కంటే రూ.424 కోట్లు అదనంగా రూ.5936 కోట్లు ఇవ్వడం రాష్ట్ర జీవనాడి పూర్తిపై ఆశలు, నమ్మకాన్ని కలిగించిందన్నారు. ఎన్డీయే కొత్త ప్రభుత్వంలోనే పోలవరం తాజా డీపీఆర్ ఆమోదించారన్న జీవీ.. తద్వారా రూ.12,157 కోట్లు ఇచ్చేందుకు అంగీకరించారని గుర్తు చేశారు. పోలవరం ప్రాజెక్టుకు ఇప్పటి వరకు వచ్చిన నిధుల్లో ఇవే అత్యధికం అన్న ఆయన ప్యాకేజీలో భాగంగా అడ్వాన్స్ కూడా ఇవ్వడంతో ఇప్పటికే పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు.



జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 03, ఫిబ్రవరి 2025

## ఎడ్లు, కోళ్ల పందేలు సంప్రదాయాల్లో భాగం: ప్రత్తిపాటి



**నాదెండ్ల, మహానాడు:** నిత్యం వ్యవసాయ పనులతో తీరిక లేకుండా గడిపే రైతులు, రైతు కూలీలు గ్రామాల్లో జరిగే కొన్ని ప్రత్యేక కార్యక్రమాల్లోనే తమ కుటుంబాలు, బంధు మిత్రులతో సంతోషంగా గడుపుతారని మాజీమంత్రి, శాసన సభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. ఆదివారం నాదెండ్ల మండల కేంద్రంలో జాతీయస్థాయి ఒంగోలు ఎడ్ల పందేలకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రారంభించారు. ఎడ్లు, కోళ్ల పెంపకం, పందేలు సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమన్న ఆయన, పందెపు ఎడ్ల పెంపకం చాలా ఖర్చుతో కూడుకున్నదన్నారు.

ఖర్చును లెక్కచేయకుండా ఎడ్ల యాజమాన్యం పేరు ప్రతిష్ఠల కోసం వాటిని కంటికి రెప్పలా సాకుతారని పుల్లారావు చెప్పారు. ఒంగోలు గిత్తలు రాజసం, పౌరుషాలకు పెట్టింది పేరన్నారు. పశువులు రైతులకు నిజమైన నేస్తాలని, వాటి ఆలనాపాలనలోనే రైతులు తమ సంతోషం వెతుక్కుంటారన్నారు. ఈ సందర్భంగా ఎడ్ల పందేల నిర్వాహకుల్ని, ఎడ్ల యజమానుల్ని పుల్లారావు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు షేక్ టీడీపీ కరిముల్లా, నెల్లూరి సదా శివరావు, బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయి బాబు, హరిబాబు, నన్నపనేని హరీష్, గ్రామానికి చెందిన నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర నూతన డీజీపీగా బాధ్యతలు చేపట్టిన హరీష్ కుమార్ గుప్తాని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన గురజాల శాసన సభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు, యువనాయకుడు యరపతినేని నిఖిల్.



గుంటూరు చుట్టుగుంట సెంటర్‌లో కృపా మినిస్ట్రీస్ ప్రార్థన మందిరంలో ప్రత్యేక ప్రార్ధనలు చేసిన సత్తెనపల్లి నియోజకవర్గ శాసన సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టబద్రులఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్

## కొండ ప్రాంతాల్లోని సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- ఎమ్మెల్యే గద్దె రామమోహన్

**విజయవాడ, మహానాడు:** నియోజకవర్గంలోని కొండ ప్రాంతాల్లోని సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టినట్టు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. ఆదివారం ఉదయం 5వ డివిజన్‌లోని పెదబావి సెంటర్ సమీపంలో కొండ ప్రాంతంలో ఎమ్మెల్యే పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను ఆయన స్వయంగా తెలుసుకున్నారు. కొండ ప్రాంతంలో రోడ్లు, రెయిలింగ్, మెట్లు నిర్మాణం చేయాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. అనంతరం అక్కడ ఉన్న హోరేబు మినిస్ట్రీస్ చర్చిను సందర్శించి అక్కడ జరుగుతున్న ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు నందిపాటి దేవానంద్, పాస్టర్ వేముల విజయ్‌ప్రసాద్, నాగూరి సురేష్‌బాబు, గద్దె రమేష్, తలారి విజయ్ , దారా గోవిందు, ఇశ్రాయేలు, కే.మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రానికి కొత్త ఊపిరి.. కేంద్ర బడ్జెట్!

- ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, మహానాడు:** 2025-26 బడ్జెట్లో కేంద్రం రాష్ట్రానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ల కృషి ఎంతో ఉంది. జగన్ అవినీతి, ఆర్థిక విధ్వంసంతో దారుణంగా దెబ్బతిన్న రాష్ట్రాన్ని తిరిగి పునర్నిర్మించడం కోసం కూటమి ప్రభుత్వం శక్తివంచన లేకుండా పనిచేస్తోందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం విలేఖర్లతో



మాట్లాడారు. దావోస్ పర్యటన అనంతరం ముఖ్యమంత్రి నేరుగా ఢిల్లీవెళ్లి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ను కలిసి రాష్ట్ర అవసరాలు.. ప్రాధాన్యతలు వివరించారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తిపై సానుకూలత వ్యక్తం చేసిన ఆమె ప్రాధాన్యతా విభాగాలు, రంగాలకు తగిన కేటాయింపులు చేయడం శుభపరిణామమనే చెప్పాలి అని ప్రత్తిపాటి తెలిపారు.

నదుల అనుసంధానంలో దేశంలోనే కీలకమైన, రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్ట్ కు రూ.5,936 కోట్లు కేటాయింపులు ఏపీ వ్యవసాయరంగానికి వెన్నుదన్నుగా నిలుస్తాయి. ప్రతి బడ్జెట్లో పోలవరం నిర్మాణానికి గణనీయమైన కేటాయింపులు ఉంటాయన్న కేంద్రం బ్యాలెన్స్ గ్రాంట్ కింద రూ.12,157 కోట్లు కేటాయించడం గమనార్హం. జాతీయప్రాజెక్ట్ పూర్తి అయ్యేందుకు కేంద్రం పూర్తిగా సహకరిస్తుందని నమ్మకముంది. ఆంధ్రుల హక్కు అయిన విశాఖ ఉక్కు కర్మాగారానికి రూ.3,295కోట్లు, విశాఖ పోర్టుకి రూ.730కోట్లు కేటాయించడం చెప్పుకోవాల్సిన విషయమని ఆయన పేర్కొన్నారు.

# పుంగనూరును మోసం చేసిన పెద్దిరెడ్డి రాజీనామా చేయాలి

- కూటమి ప్రభుత్వం అద్వితీయమైన పరిపాలన అందిస్తోంది
- వైసీపీ నాయకులు కళ్ళు మూసుకుని నిద్రపోతున్నట్టు నటిస్తున్నారు
- అధికారంలో ఉన్నప్పుడు అడ్డగోలుగా నోరు జారి... ఇప్పుడు కుంటి సాకులా..?
- సామాజిక వేదికలపై, ఇళ్ళల్లో కూర్చొని కాదు అసెంబ్లీకి వచ్చి మాట్లాడండి
- ఖనిజాలను దోచుకునే మాఫియా అంతు చూస్తానని ప్రధాని మోదీ కలికిరిలో చేసిన ప్రకటన త్వరలోనే అమలవుతుంది
- పుంగనూరు బహిరంగ సభలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు

**పుంగనూరు, మహానాడు:** రెండు లక్షల మందికిపైగా ప్రజలు ఓటు వేసి గెలిపిస్తే శాసన సభకు హాజరు కాకుండా, పుంగనూరు నియోజకవర్గం ప్రజల గొంతుకను నొక్కి పెడుతున్న పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె. నాగబాబు డిమాండ్ చేశారు. ఆదివారం చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం సోమల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో జనసేన నాయకులు ఎన్.వేణుగోపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో నాగబాబు ముఖ్య అతిథిగా మాట్లాడారు. పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి అన్యాయాలు, అక్రమాలు, ఆక్రమణలు, దోపిడీల చిట్టాను నాగబాబు బహిర్గతం చేశారు.

వైసీపీకి 11 సీట్లు ఇచ్చి గెలిపించిన 20 లక్షల మందికి పైగా ప్రజల గొంతుకను శాసన సభలో వినిపించకుండా మోసం చేస్తున్నారని, సభలో మాకు మైకు ఇవ్వరని అసత్య ఆరోపణలు చేస్తున్నారని, మీరు సభకు హాజరైతే కదా మైకులు ఇస్తారా, లేదా అని తెలిసేదని అన్నారు. శాసన సభకు హాజరు కాకపోగా కూటమి ప్రభుత్వం గురించి తప్పుడు ప్రచారాలు చేస్తూ, చీకట్లో బాణాలు వేస్తున్నారని ఆరోపించారు. వైసీపీ నాయకులు చేసిన అక్రమాలు అన్నీ వెలికితీసి న్యాయస్థానంలో నిలబెడతామని హెచ్చరించారు.

కూటమి ప్రభుత్వం అద్వితీయమైన పరిపాలన అందిస్తోందని, ఏడు నెలల కాలంలో కూటమి ప్రభుత్వం పరిపాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కళ్ళు మూసుకుని




బలవంతంగా నిద్రపోతున్నట్టు నటిస్తున్న వైసీపీ నాయకులను ఎవరూ మార్చలేమని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు అడ్డగోలుగా నోరు పారేసుకున్న వైసీపీ నాయకులు ఇప్పుడు కుంటి సాకులు చెబుతున్నారని, సామాజిక వేదికలు, ఇళ్ళల్లో కూర్చొని ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం కాదు అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని హితవు పలికారు.

గత ఎన్నికల సమయంలో చిత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రచారం చేసినప్పటికీ, పిఠాపురంలో పూర్తి సమయం కేటాయించాల్సిన కారణంగా పుంగనూరు రాలేక పోయానని, ఇకపై అవకాశం దొరికినప్పుడల్లా పుంగనూరు వస్తానని అన్నారు. అడవులను ఆక్రమించి, ఖనిజాలను దోచుకునే మాఫియా అంతు చూస్తానని కలికిరి బహిరంగసభలో మోదీ ప్రకటించారని, ఆ ప్రకటన త్వరలోనే తప్పనిసరిగా అమలవుతుందని, ఆ సమయం కోసం ఎదురు చూద్దామని చెప్పారు.

జనసేన పార్టీ కాన్ ఫ్లిక్ట్ మేనేజ్మెంట్ కమిటీ కన్వీనర్, ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ కుమార్ మాట్లాడుతూ పుంగనూరు నియోజకవర్గం అంటే గతంలో గౌరవం, మర్యాద, మంచి పేరు ఉండేదని, వైసీపీ పరిపాలన మొదలైన దగ్గర నుండి పుంగనూరు అంటే బెదిరింపులకు అడ్డాగా మార్చేసారని అన్నారు. ఇకపై మీ ఆగడాలు ఆపకపోతే మీకు తగిన రీతిలో గుణపాఠం చెబుతామని చెప్పారు. తిరుపతి శాసన సభ్యుడు ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ వైసీపీ దురాగతాలను తరిమి కొడతానని ప్రకటించిన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చెప్పినట్టుగానే కూటమిలో కీలక భూమిక పోషించి వైసీపీని ఓడించి తద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని అన్నారు.

చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ రాయలసీమ, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోనే కాదు, భారత దేశంలోనే రాజకీయ ముఖ చిత్రం మార్చేసిన పవన్ కల్యాణ్ అతి తొందరలో పుంగనూరులో స్థానిక ఎమ్మెల్యే చేస్తున్న దురాగతాలను అరికడతారని అన్నారు. జనసేన నాయకులు ఎన్.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ దేశభక్తి, అంకితభావం కలిగిన జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌తో రాజకీయ ప్రయాణం మొదలుపెట్టడం సంతోషంగా ఉందని అన్నారు.

జనసేన నాయకులు కిరణ్ రాయల్, కీర్తన, సుభాషిణి, వినుత కోట, రామ్ దాస్ చౌదరి, మై ఫోర్స్ మహేష్, చిరువేలు గంగాధర్, పగడాల రమణ, సోమశేఖర్, మధుబాబు, కవిత, అనిత, దినేష్, యుగంధర్, అమర్ నారాయణ, దేవర మనోహర్, మహేష్, టీడీపీ పుంగనూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రా రెడ్డి, బీజేపీ పుంగనూరు నియోజకవర్గం ఇన్చార్జి గన్నామదన్ మోహన్, చిత్తూరు జిల్లా జనసేన నాయకులు, పుంగనూరు నియోజకవర్గం నాయకులు, జన సైనికులు, వీర మహిళలు వేల సంఖ్యలో పాల్గొన్నారు.

# కేశినేని చిన్నికి 'సమాచార'సేవ!

- పబ్లిసిటీ సెల్‌లో విజయవాడ ఎంపి కేశినేని ప్రకటనలు
- గత టీడీపీ పాలనలోనూ కనిపించని పార్టీ నేతల ప్రకటనలు
- జగన్ జమానాలోనూ మంత్రులు, అధికారుల ప్రకటనలే
- సమాచారశాఖలో కొత్త సంస్కృతి

(మార్తి సుబ్రహ్మణ్యం)

విజయవాడ ఎంపి కేశినేని చిన్నికి సమాచార శాఖ అధికారిక సేవలపై విస్మయం వ్యక్తమవుతోంది. ఆయన విజయవాడ ఎంపి అయినప్పటికీ, అధికారికంగా ఎలాంటి ప్రొటోకాల్ లేదు. అయినప్పటికీ చిన్నికి సంబంధించిన కార్యక్రమాలన్నీ సమాచార శాఖ నిర్వహించే పబ్లిసిటీసెల్ గ్రూపులలో, గత కొద్దికాలం నుంచి తామరతంపరగా వచ్చి పడుతున్నాయి.

నిజానికి అది ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారుల రోజు వారీ కార్యక్రమాలను మీడియాకు వివరించేందుకు ఏర్పాటుచేసిన మీడియా గ్రూప్. అది కొన్ని దశాబ్దాల క్రితమే ఏర్పాటుచేసినది. ఆ గ్రూపులో పార్టీలకు సంబంధించిన కార్యక్రమాలు గానీ, ప్రభుత్వ పదవులతో సంబంధం లేని వ్యక్తుల కార్యక్రమాల వార్తలు గానీ ఇవ్వడానికి వీల్లేదు. ఈ సంప్రదాయం ఏ పార్టీ అధికారంలో ఉన్నా విజయవంతంగా కొనసాగింది.

గతంలో చంద్రబాబునాయుడు సీఎంగా ఉన్నప్పుడు సైతం ఎంపి, ఎమ్మెల్యేల కార్యక్రమాలు సమాచారశాఖ గ్రూపులలో ఎప్పుడూ పెట్టిన దాఖలాలు లేవు. నిబంధనలు లెక్క చేయరన్న పేరున్న జగన్ జమానాలో సైతం, ఈ నిబంధన కొనసాగించారు. కాకపోతే రెండు సందర్భాల్లో వైసీపీ ఎమ్మెల్యేల కార్యక్రమాలు పెట్టినప్పుడు జర్నలిస్టుల ఫిర్యాదుల తర్వాత వాటిని తొలగించారు. ఆ తర్వాత ప్రభుత్వ పదవులు లేని వారి కార్యక్రమాలు వచ్చిన దాఖలాలు లేవు.

కానీ ఈసారి సమాచార శాఖలో కొత్త సంప్రదాయానికి తెరలేచింది. విజయవాడ ఎంపి కేశినేని చిన్నికి సంబంధించిన కార్యక్రమాలన్నీ, సమాచారశాఖ గ్రూపులో ప్రతిరోజూ రావడం విస్మయపరుస్తోంది. గతంలో విజయవాడ ఎంపిగా ఉన్న కేశినేని నాని తన పార్లమెంటు పరిధిలో ఎన్ని కార్యక్రమాలు నిర్వహించినా, సమాచార శాఖ తన గ్రూపులో పెట్టలేదు. కృష్ణా జిల్లా డీపీఆర్ఓ గ్రూపులో కూడా పెట్టలేదు. కేవలం నాటి మంత్రులు దేవినేని ఉమ, కొల్లు రవీంద్ర కార్యక్రమాలు మాత్రమే మీడియాకు పంపించేవారు. మరి ఈసారి ఆ నిబంధనలు మార్చిన అధికారి ఎవరు? ఎంపి చిన్ని కార్యక్రమాలు పబ్లిసిటీ సెల్‌లో ఇవ్వాలని ఆదేశించిన అధికారి ఎవరు? అన్న చర్చ జరుగుతోంది. రేపు విజయవాడ ఎమ్మెల్యేలు సైతం తమ వార్తలు కూడా గ్రూపులో పెట్టాలని ఒత్తిడి చేస్తే పరిస్థితి ఏమిటి? అన్న చర్చకు తెరలేచింది. నిజానికి కేశినేని చిన్నికి సొంతంగా సోషల్‌మీడియా బృందాలు, ఇద్దరు పీఏలు ఉన్నారు. వారు మీడియా గ్రూపులలో చిన్ని పాల్గొనే కార్యక్రమాలు పంపిస్తుంటారు. మళ్లీ ఈ 'సమాచార' సేవ ఎందుకున్న ప్రశ్నలు మీడియా వర్గాల్లో వినిపిస్తున్నాయి.



# 'ప్రకాశం'ను పర్యాటకంగా అభివృద్ధి

- జిల్లా 56వ అవతరణ దినోత్సవంలో నూకసాని బాలాజీ

**ప్రకాశం, మహానాడు:** జిల్లా 56వ అవతరణ దినోత్సవాన్ని ఆదివారం ఒంగోలు ప్రకాశం భవనంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కలెక్టరేట్ ఆవరణలోని ప్రకాశం పంతులు విగ్రహానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి, కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, శాసన సభ్యుడు దామచర్ల జనార్దన్ రావు (ఒంగోలు), బి.ఎన్. విజయ్ కుమార్ (సంతనూతలపాడు), రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, మాల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పి.విజయ్



కుమార్, రాష్ట్ర వ్యవసాయ కార్పొరేషన్ వైస్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ, ప్రకాశం పంతులు స్ఫూర్తితో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. జిల్లా సువిశాల తీరప్రాంతాన్ని, సందర్శనీయ ప్రదేశాలను అభివృద్ధి చేసి పర్యాటక రంగాన్ని ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. జిల్లా ఏర్పాటులో రోడ్ద నారప రెడ్డి, అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి చేసిన కృషిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబ సభ్యులను, వివిధ రంగాలలో ప్రతిభ కనబర చిన వారిని సత్కరించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిఆర్ఓ శ్రీ బి. చిన ఓబులేసు, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఏపీ తరుపున మహిళా క్రికెట్ జట్టుకు అభినందనలు

- హోం మంత్రి అనిత

**అమరావతి, మహానాడు:** అండర్ -19 మహిళల క్రికెట్ వరల్డ్ కప్ సాధించి రెండోసారి విశ్వవిజేతగా నిలిచిన భారత జట్టుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున అభినందనలు. మేటి జట్లను మట్టి కరిపించి త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించిన అద్భుతమైన సందర్భంలో మన తెలుగు తేజాలు విశాఖకు చెందిన షబ్నమ్ షకీల్, తెలంగాణకు చెందిన గొంగడి త్రిష పాత్ర మరువలేనిది. కౌలాలంపూర్ వేదికగా సౌతాఫ్రికాతో జరిగిన ఫైనల్ మ్యాచ్ లో తెలుగు బిడ్డ గొంగడి త్రిష మూడు వికెట్లు తీయడంతోపాటు అజేయంగా 44 పరుగులతో విజయంలో కీలక పాత్ర పోషించగా.. బౌలింగ్ లో ఒక వికెట్ తీసిన షబ్నమ్ తన వంతు పాత్ర పోషించడం ఎంతో సంతోషాన్నిచ్చింది. మీరు సాధించిన విజయం మరెంతోమందికి ప్రేరణ అవుతుందని ఆశిస్తున్నా.. జై హింద్! అని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి అనిత ఎక్స్ వేదికగా అభినందించారు.

### అభినందనలు

అండర్-19 ఉమెన్స్ టీ20 ప్రపంచ కప్ సాధించిన భారత్ జట్టు క్రీడాకారులకు వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడు అభినందనలు తెలిపారు. ఫైనల్లో సౌతాఫ్రికాపై 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించి భారత దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పడం గర్వకారణం.

గెలుపులో కీలక పాత్ర పోషించిన మన తెలుగమ్మాయి త్రిషకు ప్రత్యేక అభినందనలు. విజేతలను ఆదర్శంగా తీసుకుని రాష్ట్రంలో బాలికలు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షిస్తున్నట్టు మంత్రి పేర్కొన్నారు.



### జయభేరి మోగించడం గర్వకారణం

మహిళ అండర్ 19తో వరల్డ్ కప్ గెలిచిన టీమిండియా కు హృదయపూర్వక అభినందనలు. ప్రపంచకప్ గెలిచిన భారత్ విశ్వ విజేతగా అవతరించింది. అండర్-19 ఉమెన్స్ టీ20 ప్రపంచ కప్‌లో జయభేరి మోగించడం గర్వకారణం. ఫైనల్లో సౌతాఫ్రికాపై 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించడం సగర్వంగా ఉంది. తెలుగమ్మాయి త్రిష అద్భుతమైన ప్రదర్శనతో భారత్ విజయాన్ని అందుకుందని క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రశంసించారు.

### హృదయ పూర్వక అభినందనలు

మహిళల అండర్ 19 క్రికెట్ ప్రపంచ కప్ పోటీల్లో విజయం సాధించిన భారత జట్టుకు నా హృదయ పూర్వక అభినందనలు.

దక్షిణాఫ్రికా జట్టుపై మహిళా జట్టు అద్భుతమైన ఆటను ప్రదర్శించి 9 వికెట్లతో ఘన విజయం సాధించింది. మహిళల జట్టు ఇటీవల వరుస విజయాలు సాధించడం వారి పోరాట పటిమకు నిదర్శనం. జట్టులో తెలుగమ్మాయి త్రిష చక్కటి అవకాశాన్ని అందిపుచ్చుకుని

రాణించడం మనందరికీ గర్వకారణం. ఈ క్రికెట్ జట్టు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నానని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు.

### విశ్వ విజేతకు అభినందనలు

మహిళల అండర్ - 19 టీ 20 ప్రపంచ కప్ పోటీల్లో విశ్వ విజేతగా నిలిచిన భారత జట్టుకు అభినందనలు... వరల్డ్ కప్ ఫైనల్ డిపెండింగ్ ఛాంపియన్ గా అడుగుపెట్టిన భారత టీమ్.. అద్భుతమైన పోరాట పటిమతో దక్షిణాఫ్రికాపై 9 వికెట్ల తేడాతో చారిత్రాత్మక విజయం సాధించడంపై మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

06

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 03, ఫిబ్రవరి 2025 ||

## ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్ విజయానికి కృషి చేద్దాం

● ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా



**కాకినాడ, మహానాడు:** ప్రత్తిపాడు నియోజకవర్గం, ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో టిడిపి కార్యాలయం వద్ద గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల అవగాహన సదస్సు ఆదివారం జరిగింది. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూటమి పార్టీల తరఫున పోటీ చేస్తున్న పేరా బత్తుల రాజశేఖర్ ని గెలిపించాలని కోరారు. గత ఐదేళ్లలో వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో జరిగిన విధ్వంసాలను అధిగమించి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు, ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందన్నారు. ఎన్డీఏ కూటమి పనితీరు చూసి ఆ పార్టీల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాజశేఖర్‌కి పట్టబద్రులు అందరూ మద్దతు ప్రకటించాలని కోరారు. వారి పేరు ఎదురుగా ఒకటి నెంబర్ వేసి వారికి అఖండ విజయం అందించాలని కోరారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఎన్ డి ఏ శ్రేణులు పాల్గొన్నారు.



## డ్రగ్స్ దరికి వెళితే జీవితం నాశనం

● ఎమ్మెల్యే దగ్గుపాటి


**అనంతపురం, మహానాడు:** యువత ఒక్కసారి ఆలోచించాలి, డ్రగ్స్ వైపు వెళ్లి మీ జీవితాన్ని నాశనం చేసుకోవద్దని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలో 10కే రన్ ఉత్సాహంగా సాగింది. ముఖ్య అతిథులుగా శాప్ ఛైర్మన్



రవినాయుడు, ఎమ్మెల్యే దగ్గుపాటి, అహుడా ఛైర్మన్ వరణ్ హాజరయ్యారు. డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా దగ్గుపాటి మాట్లాడుతూ గత ఐదేళ్లలో ఎక్కడ చూసినా గంజాయి దొరికేది... దేశంలో ఎక్కడ గంజాయి దొరికినా దాని మూలాలు ఆంధ్రలోనే ఉండేవి. ఏ కళాశాలలో చూసిన యువత డ్రగ్స్ కు ఆకర్షితులయ్యే వారు. కూటమి సర్కారు వచ్చిన ఆరు నెలల్లోనే దీనిని కట్టడి చేశామని ఆయన చెప్పారు. డ్రగ్స్ కు వ్యతిరేకంగా జరిగే కార్యక్రమాల్లో శాప్ పాల్గొంటుందని రవినాయుడు మాట్లాడుతూ తెలిపారు. జిల్లాను క్రీడా హబ్‌గా మారుస్తామని తెలిపారు. వరుణ్ మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలనపై పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా దృష్టి సారించారన్నారు.

## మధ్య తరగతికి మేలు చేసిన కేంద్ర బడ్జెట్

**అమరావతి, మహానాడు:** కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు అన్ని వర్గాలవారికి మేలుచేర్చేలా ఉన్నాయి. ప్రత్యేకించి మధ్య తరగతి వారికి ఆదాయ పన్ను వెసులుబాటు ఊరట కలిగిస్తుంది. 12 లక్షల వరకు మినహాయింపులు ఇవ్వడం



హర్షణీయం. రైతులకు కిసాన్ క్రెడిట్ పరిమితిని 3 నుంచి 5 లక్షలకు పెంచడం, ఎంఎస్ఎం ఈ లకు వరాలు ప్రకటించడంతో వ్యవసాయం, పారిశ్రామిక రంగాలకు చేయూతనిచ్చి రుణాల బాధ నుంచి తప్పించినట్టయిందని మంత్రి కొలుసు పార్థసారథి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.




విజయవాడ లబ్బీపేటలోని ఎస్ ఎస్ కన్వెన్షన హాల్‌లో బిఎన్ఐ నెట్ వర్కింగ్ కాన్ కాంక్లేవ్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బిజినెస్ సదస్సు లో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ



ఢిల్లీలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నాయకుడు గుంటూరు పార్లమెంట్ సభ్యులు తెలుగుదేశం పార్టీ తరఫున బిజెపికి మద్దతుగా ఢిల్లీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కేంద్ర మంత్రివర్యులు పెమ్మసాని చంద్రశేఖర్, వారి శ్రీమతి

## కూటమి పాలనలో విద్యార్థులపై ఫీజుల భారం!

● ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్

**విజయవాడ, మహానాడు:** ఈ నెల అయిదోతేదీన నిర్వహించనున్న వైసీపీ ఫీజు పోరు కార్యక్రమ పోస్టర్‌ను ఆదివారం ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే.. వైసిపి అధినేత జగన్ ఆదేశాలతో ఈ కార్యక్రమం చేపడుతున్నాం. తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ఏడు నెలల నుంచి కాలక్షేపం చేస్తోంది. విద్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేస్తున్నాం. రమా క్లాత్ సెంటర్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ చేస్తాం. కరోనా లాంటి కష్ట సమయంలో కూడా జగన్ ఏ పథకం ఆపలేదు. నాడు నేడు ద్వారా జగన్ విద్యావ్యవస్థను అభివృద్ధి చేశారు. నేడు పేద ప్రజలకు చదువును దూరం చేసేవిధంగా కూటమి ప్రభుత్వం ప్రవర్తిస్తోంది. ఫీజులు కట్టలేదని విద్యార్థులను బయటికి పంపించే పరిస్థితి నేడు వచ్చింది.

ప్రైవేట్ కళాశాలల్లో విద్యార్థుల సూసైడ్లు పెరుగుతున్నాయి. విద్యార్థులపై ఫీజుల గురించి యాజమాన్యాలు తేస్తున్న ఒత్తిడి తట్టుకోలేక విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పథకాలు అమలు చేయలేనని చంద్రబాబు చెప్పడం అతని అసమర్థతకు ఉదాహరణ. ఎలాంటి క్లిష్ట పరిస్థితులు వచ్చిన జగన్ ఒక్కసారి కూడా పథకాలు అమలు చేయడం నావల్ల కాదు అని చెప్పలేదు. ఇచ్చిన హామీలు అమలు చేయడం కోసం జగన్ అహర్నిశలు కృషి చేశారు. కేంద్రం పెట్టిన బడ్జెట్ లో ఆంధ్రప్రదేశ్ కు మొండి చేయి చూపించారు. బడ్జెట్ వల్ల రాష్ట్రానికి ఎటువంటి ఉపయోగం లేదు. తాము లేకపోతే కేంద్రం లేదు అని జబ్బలు చరుచుకునే చంద్రబాబు, పవన్ కల్యాన్, నారా లోకేష్ బడ్జెట్ పై ఎందుకు మాట్లాడటం లేదు? ప్రజలకు అన్యాయం జరిగితే ఎందుకు




స్పందించడం లేదు? కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కడియాల బుచ్చిబాబు, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ,ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ,తూర్పు నియోజకవర్గ వైసిపి కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

## ధార్మిక పర్యాటక కేంద్రంగా గంగపట్టణాన్ని అభివృద్ధి చేస్తా..

● ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**గంగపట్నం, మహానాడు:** శ్రీ చాముండేశ్వరి అమ్మవారి మహా కుంభాభిషేకం, ధ్వజారోహణ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆదివారం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి గంగపట్నం విచ్చేశారు. ఆలయ అర్చకులు పూర్ణకుభంతో ఘన స్వాగతం పలికారు. చామందేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గంలోని ప్రజలందరూ సుఖ శాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. శక్తిశ్వరూపిణి అయిన అమ్మవారిని సేవించడం వల్ల మానసిక వ్యాధులు, గ్రహదోషాలు, రోగాలు తొలగిపోతాయన్నారు.

గంగపట్నాన్ని ప్రముఖ పర్యాటక ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. శక్తిస్వరూపిణిగా ప్రసిద్ధి చెందిన చామండేశ్వరి అమ్మవారి ఆలయంలో మహా కుంభాభిషేకం, ధ్వజారోహణ కార్యక్రమాలలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇందుకూరుపేట టిడిపి అధ్యక్షుడు రావెళ్ల వీరేంద్ర నాయుడు, టిడిపి సీనియర్



నాయకులు దువ్వూరు కల్యాణ్ రెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి, జనసేన నాయకులు గుడి హరికుమార్ రెడ్డి, స్థానిక టిడిపి నాయకులు కొండూరు సుధాకర్ రెడ్డి, బొద్దుకూరు సుధీర్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్ చిరు వ్యాపారస్తులకు మేలు!

● దూండి రాకేష్

బడ్జెట్‌లో 12 లక్షల రూపాయల వరకు ఆదాయ పన్నులు మినహాయించడం, మధ్య తరగతి కుటుంబీకులకు, చిరు వ్యాపారస్తులకు చేయూతనిచ్చే అంశం. ఇంత పెద్ద అంశాన్ని కేంద్ర ప్రభుత్వం, ఎన్డీయే కూటమి ప్రభుత్వం బడ్జెట్ లో ప్రవేశపెట్టడంపట్ల ప్రజలు హర్షిస్తున్నారని ఏపీ ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దూండి రాకేష్ అన్నారు. ఈ మేరకు ఆయన పరిశీలిస్తూ పేద ప్రజలకు ఉపయోగపడడానికి పెట్టిన అంశాలను అమలు చేస్తున్నాం. బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉండాలనే ఉద్దేశంతో ఎన్డీయే ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో దావోస్ లో అనేక పెద్దపెద్ద కంపెనీలతో ఎంఓయూలు చేసుకున్నారు. ఇది మంచి శుభ పరిణామమని, పెద్ద ఎత్తున కంపెనీలు రాష్ట్రానికి రానున్నాయని తెలిపారు.




ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటినుంచి రాష్ట్రం అభివృద్ధి చెందుతోంది. బడ్జెట్ ద్వారా బడుగు బలహీన వర్గాల వారికి మేలు జరుగుతుందని వెల్లడించారు.

ఎన్నికలకు ముందు టీడీపీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలోని అంశాల్ని ప్రతి ఒకదాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. ఒక్కొక్క దాన్ని

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ 42 వ డివిజన్ అధ్యక్షుడు శివాజీ, 43వ డివిజన్ అధ్యక్షుడు రాంబాబు, వాణిజ్య విభాగం రాష్ట్ర సెక్రటరి ప్రసన్నలక్ష్మి, ఆర్యవైశ్య నాయకులు వివికె నరసింహరావు, జాలాది వెంకటేశ్వరరావు, సీఎల్ కె అరుణ్, సతీష్, యువరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## బీసీ జనగణన ఎంత సక్కగ చేసింద్రో?!



ఇంతకంటే పెద్ద కుట్ర భారత దేశ చరిత్రలోనే కాదు..తెలంగాణ చరిత్రలో క్దూడా లేదు..నేను ఎలాంటి కాంట్రవర్సీకి వెళ్లొద్దని గమ్మున కూర్చున్నా..అయినా ఇలాంటివి టెంప్ట్ చేస్తున్నయ్.. అంతా నా కర్మ..ఖర్మ...

20 ఏండ్లుగా బీసీ ఉద్యమాలతో పాటుగా అనేక ఉద్యమాల్లో ప్రత్యక్షంగా ఉన్నా నేను..

మామూలుగా కాదు.. ఉద్యమాలను శ్వాసించి.. ఊగించిన వాన్ని.. ఆర్.కృష్ణయ్య, విజిఆర్ నారగోని, బిఎస్ఎ స్వామి గారల నుండి ఇప్పటి బీసీ ఉద్యమకారుల వరకూ..

కొండా లక్ష్మణ్ బాపూజీ గారి నుంచి నేటి ఉద్యమకారుల వరకూ..ప్రతి బీసీ ఉద్యమ సంఘం, ఉద్యమకారులతో మమేకమై ప్రత్యక్షంగా, పరోక్షంగా చిత్తశుద్ధితో పనిచేసిన.

అయినా, బీసీ జనగణన లో నా పేరే పరిగణనలోకి తీసుకోలేదు.. నన్ను గానీ, నా కుటుంబ వివరాలు గానీ నమోదే చేయలేదు...ఇది వాస్తవం.

కుటుంబ సర్వే ఎంత సక్కగ చేసింద్రో ఒక్కసారి ఆలోచించాలె మీరంతా... ఇది ఎవరినో తప్పు పట్టేందుకు కాదు.. కానీ జరిగిందంతా ఒక ప్రహసనంలా.. ఒక తంతులా జరిగిందనేది నా వ్యక్తిగత అభిప్రాయం.

తెలంగాణ రాష్ట్రంలో బీసీలు 55 % పైగా ఉంటారు.. అదీ సరిగ్గా జనగణన జరిపితే.. నిజాలు నిగ్గు తేలుతాయి..

ఈ నివేదిక తప్పుల తడక పట్ల ప్రతి బీసీ నిరసన తెలుపాలనని 'తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల వేదిక' కోరుతున్నది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ప్రజా ప్రతినిధికి తమ నిరసన తెలియజేయాలని మనవి చేస్తున్నది. బీసీ జనగణననే సరిగ్గా జరగనప్పుడు సామాజిక న్యాయం జరుగుతుందనేది నూటికి నూరు శాతం అబద్ధం..

(నోట్ : వాస్తవాలు చెబితే నాలాంటి అమాయకులపై ప్రతీకార చర్యలకు పాల్పడకుండా వాస్తవాలను నిగ్గుతేల్చాలని నాయకులకు మనవి.)

- భారత సుదర్శన్


రాష్ట్ర కన్వీనర్,

తెలంగాణ ఉద్యమ జర్నలిస్టులు వేదిక



## భారత జట్టుకు అభినందనలు

**అమరావతి, మహానాడు:**



డిఫెండింగ్ ఛాంపియన్‌గా అడుగుపెట్టి రెండో సారి మహిళల అండర్–19 టీ–20 క్రికెట్ వరల్డ్ కప్ విజేతగా నిలిచిన భారత జట్టుకు అభినందనలు తెలియజేస్తున్నాను. సమిష్టి ప్రదర్శనతో దక్షిణాఫ్రికాను ఓడించి అంతర్జాతీయ స్థాయిలో దేశ ఖ్యాతిని ఇనుమడింపజేశారు. టోర్నీ మొత్తం తనదైన బ్యాటింగ్, బౌలింగ్ తో అద్భుత ప్రదర్శన చేసిన తెలుగు క్రికెటర్ గొంగడి త్రిష అందరికీ గర్వకారణంగా నిలిచారు. భారత మహిళల జట్టు భవిష్యత్ లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నాను అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.





డోన్ పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహం ఆవరణంలో ఏర్పాటుచేసిన క్రికెట్ నెట్ ప్రాక్టీస్, కబడ్డీ కోర్ట్, షటిల్ కోర్ట్, బ్యాట్మెంటన్ కోర్ట్ మరియు స్కేట్టింగ్ ట్రాక్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గౌరవనీయులు డోన్ శాసనసభ్యులు శ్రీ కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి



వినుకొండ నియోజకవర్గం, నూజెండ్ల మండలం పమిడిపాడు గ్రామంలో తులసిమాత ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ ఉత్సవంలో ప్రభుత్వ చీఫ్ విప్ ఆంజనేయులు, సతీమణి, శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి, టీటీడీ పాలక మండలి సభ్యుడు జంగా కృష్ణమూర్తి, మాజీ శాసన సభ్యుడు మక్కెన మల్లికార్జున రావు, తదితరులు పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.



ఢిల్లీలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు స్వాగతం పలికిన టీడీపీ ఎంపీలు. చిత్రంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు మాజీ ఎంపి కనకమేడల రవీందర్ కూడా ఉన్నారు.

## విశ్వ విజేత భారత జట్టుకు మంత్రి సుభాష్ అభినందనలు

**రామచంద్రపురం:** మహిళల అండర్ –19 టీ 20 ప్రపంచ కప్ పోటీల్లో విశ్వ విజేతగా నిలిచిన భారత జట్టుకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ వరల్డ్ కప్ ఫైనల్ డిపెండింగ్ ఛాంపియన్‌గా అడుగుపెట్టిన భారత టీమ్ అద్భుతమైన పోరాట పటిమతో దక్షిణాఫ్రికాపై 9 వికెట్ల తేడాతో చారిత్రాత్మక విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు.



డిజిటల్ న్యూస్ పేపర్

సోమవారం 03, ఫిబ్రవరి 2025

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ మీడియాలో ..

# జయహో "మహానాడు"

# 3,21,041

## ఈ-పేపర్ పాఠకులకు సగర్వంగా సవినయంగా సెల్యూట్




మార్చి 1న ప్రారంభమైన మన

మహానాడు ప్రస్థానంలో కలిసి నడుస్తున్న

మా అభిమాన పాఠకుల

అనుబంధానికి వందనం





సీనియర్ జర్నలిస్ట్

మార్తి సుబ్రమణ్యం

సంపాదక సారథ్యంలో





బొడెపూడి సుబ్బారావు (BSR)

సారథ్యంలో



జనం గుండె చప్పుడు

# మహానాడు

08

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || సోమవారం 03, ఫిబ్రవరి 2025 ||






## అందరినీ ఎంటర్ టైన్ చేయాలనే

# పాషన్‌తో వస్తున్నాం- అఖిల్ అక్కినేని

సిసిఎల్ 11వ సీజన్ & తెలుగు వారియర్స్ థ్రిల్లింగ్ గేమ్ షెడ్యూల్‌ను ప్రకటించింది. సెలబ్రిటీ క్రికెట్ లీగ్ ఫిబ్రవరి 8న బెంగ ళూరులో 11వ సీజన్‌ను ప్రారంభం కానుంది, ఇది మైదానంలో మరపురాని క్షణాలను అందిస్తోంది. ఈ సీజన్‌లో నాలుగుసార్లు ఛాంపియన్‌లుగా తమ లెగసీ కంటిన్యూ ని చేయడానికి వారి ప్రతిష్టాత్మకమైన 5వ టైటిల్ గెలుపు కోసం సిద్ధమవుతున్న బలమైన జట్టు తెలుగు వారియర్స్ పై అందరి దృష్టి ఉంది. ఈ సందర్భంగా తెలుగు వారియర్స్ జెర్సీ లాంచ్ ప్రెస్ మీట్ నిర్వహించింది. తెలుగు వారియర్స్ కెప్టెన్ అఖిల్ అక్కినేని మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. సిసిఎల్ 14 ఏళ్ల జర్నీ. గ్లింప్స్ లో చూస్తే ఓ చోట మరీ చిన్నపిల్లాడిలా కనిపించాను. సిసిఎల్ ఆడుతూ పెరిగాను. విష్ణు, సచిన్ పాషన్ తో ఇది సాధ్యపడిందని భావిస్తున్నాను. మేము నాలుగు సార్లు టైటిల్ గెలిచాం. ఈసారి కూడా టైటిల్ కొట్టి ఐదు సార్లు ఛాంపియన్ గా నిలుస్తామనే నమ్మకం వుంది. అన్నిటికంటే అందరినీ ఎంటర్ టైన్ చేయాలనే పాషన్ తో వస్తున్నాం. 14, 15 ఉప్పల్ స్టేడియంలో ఆడుతున్నాం. అందరూ వచ్చి సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాము' అన్నారు. ఎస్ఎస్ తమన్ మాట్లాడుతూ.. క్రికెట్ అనేది నా చైల్డ్ వుడ్ డ్రీం. సిసిఎల్ ఫార్మెట్ నా డ్రీం ని తీర్చింది. దేశంలోని ప్రముఖ మైదానాల్లో క్రికెట్ ఆడటం ఓ అదృష్టం. అఖిల్ అగ్రెసివ్ కెప్టెన్. తన ఎత్తుగడలు అద్భుతంగా వుంటాయి. తనలో చాలా ఫైర్ వుంది. క్రికెట్ మాకు చాలా ఎనర్జీ ఇస్తోంది. మాది చాలా క్రేజీ టీం. సచిన్ టీంకి ఓనర్ తో పాటు ఆటగాడిగా బిగ్గెస్ట్ స్ట్రెంత్. మూడు నెలలుగా చాలా ప్రాక్టీస్ చేశాం.

# 'ది ప్యారడైజ్'కు రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్

నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ (SLV సినిమాస్) నిర్మాత సుధాకర్ చెరుకూరి 'దసరా' బ్లాక్ బస్టర్ విజయం తర్వాత 'ది ప్యారడైజ్' కోసం కొలాబరేట్ అయ్యారు. ఈ కొత్త చిత్రం త్వరలో ప్రారంభం కానుంది. ప్రీ-ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయి. నాని కూడా తన పాత్ర కోసం సిద్ధం కావడానికి ఇంటెన్స్ గా జిమ్ చేస్తున్నారు. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతం అందించడం ఖాయమైయింది. జెర్సీ, గ్యాంగ్‌లీడర్ హిట్స్ తర్వాత నాని, అనిరుధ్ కలిసి పనిచేస్తున్న మూడవ చిత్రం ఇది. గత రెండు సినిమాలు మ్యూజికల్ హిట్స్ గా నిలిచాయి, అప్ కమింగ్ ప్రాజెక్ట్ కోసం అంచనాలు భారీగా వున్నాయి. శ్రీకాంత్ ఓదెలా పవర్ ఫుల్ లార్జర్ దెన్ లైఫ్ కథను ఇంటెన్స్ స్క్రీన్‌ప్లేతో రూపొందించారు, ఇది నానిని పూర్తిగా కొత్త, మాస్-డ్రైవ్ అవతార్‌లో ప్రజెంట్ చేయనుంది. నిర్మాత సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని గ్రాండ్ గా స్కేల్ లో నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఇప్పటివరకు నాని యొక్క మోస్ట్ హై బడ్జెట్ వెంచర్.

# దిల్‌రాజు ప్రశాంత్‌నీల్ కాంబో

కేజీఎఫ్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ ప్రస్తుతం ఎన్టీఆర్ తో సినిమాకు రెడీ అవుతున్నాడు. ప్రభాస్ తో సలార్ 1 చేసిన ప్రశాంత్ నీల్ పార్ట్ 2 ని నెక్స్ట్ చేయనున్నాడు. ఎన్ టీ ఆర్




తో చేస్తున్న సినిమా కూడా రెండు భాగాలుగా వస్తుందని టాక్. ఐతే తారక్ సినిమా మొదటి పార్ట్ రిలీజ్ అయ్యాక సలార్ 2వ భాగం చేసే ఛాన్స్ ఉందని తెలుస్తుంది. ఇక ప్రశాంత్ నీల్ సలార్ 2, ఎన్టీఆర్ సినిమా పూర్తి చేశాక స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజుతో ఒక సినిమా చేస్తాడని తెలుస్తుంది. దిల్ రాజు ఈమధ్యనే గేమ్ ఛేంజర్, సంక్రాంతికి వస్తున్నాం సినిమాలు తీశాడు. అందులో ఒకటి సూపర్ హిట్ కాగా మరొకటి బోల్తా కొట్టింది. ఐతే సంక్రాంతికి వస్తున్నాం సినిమా రిజల్ట్ తో తమకు ఒక పాఠం బోధ పడిందని రీసెంట్ గా దిల్ రాజు అన్నారు. ప్రశాంత్ నీల్ తో దిల్ రాజు సినిమా ఉంటుందని లేటెస్ట్ టాక్. ఐతే ఈ కాంబో సినిమాలో హీరో ఎవరన్నది ఇప్పుడు ఇంట్రెస్టింగ్ ప్రశ్నగా మారింది. ఆల్రెడీ ఎన్ టీ ఆర్ తో చేస్తునాడు ప్రశాంత్ నీల్ నెక్స్ట్ సినిమా ప్రభాస్ తో ఉంది. అది సలార్ 2. ఐతే దిల్ రాజు ప్రభాస్ ప్రశాంత్ నీల్ తో సినిమా చేయాలని అనుకున్నాడని ఆమధ్య వార్తలు వచ్చాయి. ఒకవేళ ప్రశాంత్ నీల్, ప్రభాస్ మళ్లీ కలిసి చేసే ఛాన్స్ ఉండొచ్చు. ప్రభాస్ కాకుంటే రాం చరణ్ ఆ ఛాన్స్ తీసుకుంటాడని తెలుస్తుంది. గేమ్ ఛేంజర్ విషయంలో భారీ నష్టాలు ఎదుర్కొన్న దిల్ రాజుకి అండగా ఉంటానని ఆల్రెడీ రాం చరణ్ చెప్పాడని టాక్. సో ప్రశాంత్ నీల్ డైరెక్టర్ అయితే రాం చరణ్ సినిమా ఓకే చేసే ఛాన్స్ ఉంటుంది. దిల్ రాజు, ప్రశాంత్ నీల్ కాంబోలో హీరోగా ప్రభాస్, చరణ్ ఇద్దరిలో ఒకరయ్యే ఛాన్స్ ఎక్కువ ఉంది. ఈ ఇద్దరు కాకపోతే మాత్రం మరో స్టార్‌ని చూసు కుంటారు.



# టాప్-10 నేపో కిడ్స్


సినీరంగంలో నటవారసుల సక్సెస్ గురించి చాలా చర్చ సాగుతోంది. ఇక్కడ అత్యంత ప్రతిభావంతులు మాత్రమే దీర్ఘకాలంలో మనుగడ సాగించగలరు. తల్లిదండ్రులు పెద్ద స్టార్లు అయినా కానీ, వారసులు రాణించిన సందర్భాలు అరుదు. అందుకు బాలీవుడ్ సహా అన్ని పరిశ్రమల్లో చాలా ఉదాహరణలు ఉన్నాయి. ఇటీవల బంధుప్రీతి, నటవారసత్వం గురించి చాలా చర్చ సాగుతోంది. బంధుప్రీతి కారణంగా చాలా మంది బయటి వారికి అవకాశాలు ఇవ్వడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ పరిస్థితి బాలీవుడ్ లో మరింత తీవ్రంగా ఉందన్న విమర్శలున్నాయి. 2025 లో అరంగేట్రం చేస్తున్న టాప్ 10 బాలీవుడ్ స్టార్ కిడ్స్ వివరాల్లోకి వెళితే.. స్టార్డమ్‌ను రీడిఫైన్ చేసేందుకు రెడీ అవుతున్న 10 మంది నేపో కిడ్స్ వివరాలు ఇలా ఉన్నాయి. ఇబ్రహీం అలీ ఖాన్, ఆమన్ దేవ్‌గన్, అహాన్ పాండే, ఖుషి కపూర్, షానయా కపూర్, రాషా తడానీ, సిమర్ భాటియా, ఆర్యన్ ఖాన్, ఆర్యమాన్ డియోల్, వీర్ పహరియా బరిలో నిలిచారు. బాలీవుడ్ లో స్టార్ డమ్ ను మరో స్థాయికి చేర్చగలిగే నెపో కిడ్స్ జాబితాలోని ఇబ్రహీం అలీ ఖాన్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అతడు తన తండ్రిలాగే అందగాడు. ప్రతిభావంతుడు. కరణ్ జోహార్ దర్శకత్వం వహించిన సర్జమీన్ చిత్రంలో ప్రముఖ నటి కాజోల్ తో కలిసి అతడు ఆరంగేట్రం చేస్తున్నారు. ఇబ్రహీం సారా అలీ ఖాన్ తమ్ముడు. ఇటీవలే ఇబ్రహీం- ఖుషి కపూర్ జంటగా మరో చిత్రాన్ని కరణ్ అధికారికంగా ప్రకటించారు. కరణ్ జోహార్ దర్శకత్వంలో రూపొందుతున్న - నదానియన్%-%లో ఖుషీ కపూర్ - ఇబ్రహీం అలీ ఖాన్ జంటగా నటిస్తున్నారు. బాలీవుడ్ లో పెద్ద ఫ్యామిలీ నుంచి వెండి తెరకు పరిచయమయ్యాడు. ఈ యంగ్ హీరో అజయ్ దేవగన్ మేనల్లుడు. మేటి కథానాయిక రవీనా టాండన్ కుమార్తె రాషా తడానీతో కలిసి - ఆజాద్ - అనే చిత్రంలో నటించాడు. ఈ చిత్రంలో స్టార్ కిడ్స్ నటన ఫర్వాలేదనిపించినా ఇంకా చాలా బెటర్ మెంట్ కావాలని విశ్లేషించారు. అయితే రాషా తడానీ ఉయ్ అమ్మా సాంగ్ తో గుబులు పుట్టించిందని కితాబు అందుకుంది. 2025లో తెరకు పరిచయమైన నెపో కిడ్స్ జాబితాలో వీర్ పహారియా ఒకరు. వీర్ పహారియా మాజీ కేంద్ర మంత్రి సుశీల్ కుమార్ షిండే మనవడు. అతడు సూపర్ స్టార్ అక్షయ్ కుమార్, నిమ్రత్ కౌర్, సారా అలీ ఖాన్‌లతో కలిసి స్కై ఫోర్స్ చిత్రంతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టాడు. అభిషేక్ కపూర్ ఈ వార్ డ్రామాకు దర్శకత్వం వహించారు. తన తాతగారి ప్రతిష్ట కారణంగా వీర్ పహారియా బాలీవుడ్ నెపో కిడ్స్ జాబితాలో ఒకడు అయ్యాడు. ఇటీవలే విడుదలైన స్కై ఫోర్స్ చిత్రానికి మంచి సమీక్షలు వచ్చాయి. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద 100 కోట్ల క్లబ్ లో చేరనుందని ఇటీవల కథనాలొచ్చాయి. బాలీవుడ్ జెన్ జెడ్ స్టార్ కిడ్స్ జాబితాలో అహాన్ పాండే కూడా ఉన్నాడు. యంగ్ హీరోయిన్ అనన్య పాండే బంధువు అహాన్ పాండే. ఈ సంవత్సరం చివర్లో మోహిత్ సూరి దర్శకత్వం వహించే సినిమాతో అరంగేట్రం చేస్తున్నాడు. రొమాంటిక్ సినిమాతో అతడు తెరకు పరిచయం కానున్నాడు. 2025లో బాలీవుడ్ కి పరిచయమవుతున్న టాప్ నేపో కిడ్స్ లో అహాన్ పాండే ఏ మేరకు రాణిస్తాడో వేచి చూడాలి. బాలీవుడ్ నేపో కిడ్స్ లో కింగ్ ఖాన్ షారూఖ్ వారసుడు ఆర్యన్ ఖాన్... ఇతరులకు భిన్నంగా తెరవెనక పరిచయమవుతున్నాడు. అతడు నటుడిగా కాకుండా, దర్శకుడిగా పరిచయమవుతుండడం సర్వత్రా ఆసక్తిని కలిగిస్తోంది. షారుఖ్ ఖాన్ - గౌరీ ఖాన్ ల వారసుడు ఆర్యన్ ఫిలింమేకింగ్‌పై ఎంతో




ఆసక్తిగా ఉన్నాడు. ఈ సంవత్సరం స్టార్‌డమ్ అనే వెబ్ సిరీస్‌తో దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నాడు. బాలీవుడ్ నెక్ట్స్ జెన్ స్టార్ల జాబితాలో నెపో కిడ్ ఆర్యమాన్ డియోల్ పేరు ఉంది. ఆర్యమాన్ .... బాబీ డియోల్ కుమారుడు. లెజెండరీ నటుడు ధర్మేంద్ర మనవడు. అతడు ఫ్యామిలీ డ్రామా మూవీతో ఆరంగేట్రం చేస్తున్నాడని కథనాలొచ్చాయి. యంగ్ డియోల్ రాకపై అంచనాలున్నాయి. సందీప్ వంగా యానిమల్ చిత్రంతో బాబి డియోల్ ఘనమైన పునరారంగేట్రం చేసాడు. ఇప్పుడు తనయుడిని లాంచ్ చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నాడు. ఆర్యమాన్ కూడా జెన్ జెడ్ స్టార్ గా రాణిస్తాడని ఆశిస్తున్నారు. అరడజను నటవారసురాళ్లు ఢీ: కథానాయికల్లో సుహానాఖాన్, ఖుషి కపూర్, సిమర్ భాటియా బాలీవుడ్ కి పరిచయమవుతున్నారు. శ్రీదేవి- బోనికపూర్‌ల రెండో కుమార్తె ఖుషీ కపూర్ ఇప్పటికే - ది ఆర్చీస్- వెబ్ సిరీస్‌తో పరిచయమైంది. కానీ ఇప్పుడు జునైద్ ఖాన్‌తో కలిసి తన రొమాంటిక్ కామెడీ చిత్రం -లవ్‌యాపా-తో పెద్దతెరకు పరిచయమవుతోంది. ప్రస్తుతం తన సినిమాని ప్రమోట్ చేయడంలో బిజీగా ఉంది. ఇదే చిత్రంతో అమీర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ కూడా తెరపై రాణించేందుకు ప్రయత్నించాడు కానీ అతడి మొదటి సినిమా మహారాజాలో ఆశించినంతగా అతడి స్క్రీన్ ప్రెజెన్స్ లేదని విమర్శలొచ్చాయి.





## కాప్ స్టోరీలతో

# కాకపుట్టిస్తున్నారు

వెండి తెరపై కాకీ కథల పవరేంటో చెప్పాల్సిన పనిలేదు. స్టార్ హీరోలు కాప్ స్టోరీల్లో నటిస్తున్నారంటే ఆ కిక్కే వేరుగా ఉంటుంది. అయితే ఈ మధ్య కాలంలో టాలీవుడ్ లో ఆ తరహా సినిమాలు కాస్త తగ్గాయి. డిఫరెంట్ జానర్లవైపు చూడటంతో కాకీ పవర్ తగ్గింది. అప్పుడప్పుడు కొన్ని సినిమాలు రిలీజ్ అయినా పోలీస్ పాత్ర అలా వచ్చి ఇలా వెళ్లిపోతుంది. నిఖార్సైన కాకీ కథలకు గ్యాప్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో వేసవి కానుకగా కొన్ని కాప్ స్టోరీలు ప్రేక్షకుల్ని అలరించ డానికి రెడీ అవుతున్నాయి. మాస్ రాజా రవితేజ కథానాయకుడిగా భాను భోగవరపు దర్శకత్వంలో 'మాస్ జాతర' తెరకెక్కుతోంది. ఇందులో రాజా పోలీస్ పాత్ర పోషిస్తున్నాడు. విక్రమ మార్కుడు, పవర్, క్రాక్, వాల్తేరు వీరయ్య పోలీస్ తర్వాత మాస్ రాజా మళ్లీ పోలీస్ యూనిఫాంలో కనిపించలేదు. మళ్లీ 'మాస్ జాతర' కోసం యూనిఫాం వేసాడు. అయితే ఈసారి యూనిఫాం వేసింది రైల్వే ప్రొటక్షన్ కోసం. లక్ష్మణ్ భేరి అనే రైల్వే పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నాడు. అలాగే నేచురల్ స్టార్ నాని సీరియస్ పోలీస్ గా ఇంతవరకూ కనిపించలేదు. తొలిసారి 'హిట్ ది థర్డ్ కేస్' కోసం క్రైమ్ ఆఫీసర్ గా బరిలోకి దిగుతున్నాడు. ఇది చాలా సీరియస్ అండ్ పవర్ ఫుల్ రోల్. ఇంటెన్స్ యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్ లోనటించడం ఇదే తొలిసారి. దీంతో నాని అర్జున్ సర్కార్ అనే పోలీస్ పాత్రలో పవర్ ఫుల్‌గా కనిపించ నున్నాడు. మే1న ఈ చిత్రం రిలీజ్ అవుతుంది. ఇక విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి ఓ స్పై థ్రిల్లర్‌ని రూపొందిస్తున్నాడు. ఇందులో విజయ్ 'పోకిరి'లో మహేష్ రేంజ్ అండర్ కవర్ కాప్‌గా కనిపించనున్నాడు. విజయ్ ఎంతో ఇష్టపడి చేస్తోన్న చిత్రమిది. మహేష్ రేంజ్‌లో ఎలివేషన్లు ఉంటాయని అభిమానులు ఆశిస్తున్నారు. రెండు భాగాలుగా తెరకెక్కుతోన్న చిత్రం మేలో మొదటి భాగం రిలీజ్ అవుతుంది. అలాగే యువ హీరో బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా సాగర్ కె.చంద్ర దర్శకత్వంలో 'టైసన్ నాయుడు'లో నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమాతో బెల్లంకొండ తొలిసారి పోలీస్ గెటప్‌లో కనిపించనున్నాడు. ఈపోలీస్ కాస్త డిఫరెంట్ గానూ మెప్పించనున్నాడు. అన్ని పనులు పూర్తి చేసుకుని ఏప్రిల్ లో రిలీజ్ కానుంది. ఇలా ఈ సమ్మర్ వరుస పోలీసు స్టోరీలతో మరింత హీటెక్కనుంది.


Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144